ఏలూరు ఉష్ణోగ్రతలు
గరిష్ఠం : 31.0
కనిష్ఠం : 26.0



మళ్లీ ముంచుకొస్తోంది

అనూహ్యంగా పెరిగిన గోదావరి నీటిమట్టం

- భద్రాచలంలో మూడు, ధవళేశ్వరంలో రెండో ప్రమాద హెచ్చరిక.. వణుకుతున్న వేలేరుపాడు
- కుక్కునూరు-భద్రాచలం మధ్య రాకపోకలు బంద్.. ముంపులోనే వరి పొలాలు
- ఐదు రోజులుగా కనకాయలంక కాజ్‌వేపై పడవ ప్రయాణం.. ఉధృతంగా వశిష్ఠ

ఆంధ్రా-తెలంగాణ సరిహద్దు మధ్య రహదారిపై ప్రవహిస్తున్న గోదావరి వరద

కుక్కునూరు/వేలేరుపాడు/పోలవరం/ఆచంట/నరసాపురం టౌన్, జూలై 27 : గోదావరి వరద మళ్లీ పెరుగుతోంది. శనివారం సాయంత్రం నాలుగు గంటలకు భద్రాచలం వద్ద గోదావరి నీటిమట్టం 53 అడుగులు దాటడంతో మూడో ప్రమాద హెచ్చరిక జారీచేశారు. ఇది మరింత పెరిగే అవకాశం ఉందని కేంద్ర జలవనరుల శాఖ వెల్లడించడంతో కుక్కునూరు, వేలేరుపాడు, పోలవరం, పెనుగొండ, ఆచంట, యలమంచిలి గోదావరి తీర ప్రాంతాల్లో ఆందోళన నెలకొంది. కుక్కునూరు గ్రామ శివారులోకి వరద నీరు ముంచుతోంది. ఇక్కడి వారిని కివ్వాక పునరావాస కేంద్రాలకు తరలి వెళ్ళాలని అధికారులు ఆదేశించారు. పుల్లప్పగూడెం సమీపంలోకి గోదావరి వరద వచ్చి చేరింది. వెంకటాపురం ఎస్సీ కాలనీకి వెళ్లి రహదారిలో గోదావరి వరద నీట మునిగింది. గోదావరి మరింత పెరిగితే గొమ్ముగూడెం పంచాయతీలోని ఉప్పర మద్దిగట్లతోపాటు ఆంబోతులగూడెం, చెరువు కొమ్ముగూడెం గ్రామాలు ముంపు బారిన పడనున్నాయి. వారం రోజులుగా వేలేరుపాడు మండలంలోని 30 గ్రామాలకు రాకపోకలు స్తంభించాయి. గోదావరి ఉపనది తాళిపేరుకు వరద పోటెత్తడంతో లక్షా 20 వేల క్యూసెక్కుల నీటిని దిగువన వున్న గోదావరిలోకి వదిలారు. తెలంగాణలోని గోదావరి పరివాహక జిల్లాలైన భద్రాద్రి, కొత్తగూడెం, ఖమ్మం, వరంగల్, ఆదిలాబాద్, నిర్మల్ తదితర జిల్లాల్లో కురుస్తున్న వర్షాలకు కారణంగా



కుక్కునూరు గ్రామ శివారుల్లో ముంచుకొస్తున్న గోదావరి వరద

వరద నీరు గోదావరికి పోటెత్తుతోంది. ఈ జిల్లాలో మరో మూడు రోజులపాటు వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ హెచ్చరిక జారీ చేసింది. భద్రాచలం వద్ద నీటిమట్టం 57 అడుగులకు చేరుకుంటే వేలేరుపాడులో వరద నీరు ఇళ్ళలోకి ప్రవేశిస్తుంది. ఇప్పటికే సంత మార్కెట్ సెంటర్‌లోని ఇళ్లలోకి నీరు ప్రవేశించటంతో వాటిని ఖాళీ చేయించి పునరావాస కేంద్రాలకు తరలించారు. ప్రస్తుతం వరద మండల ప్రజలకు కంటి మీద కునుకు లేకుండా చేస్తుంది. జల దిగ్బంధంలో చిక్కుకున్న 30 గ్రామాలతోపాటు మరికొన్నింటిని వరద చుట్టుముట్టే ప్రమాదం ఉండటంతో అధికారులు అక్కడి ప్రజలను తరలించే ఏర్పాట్లు చేస్తున్నారు. 53 అడుగులకు చేరుకోగానే 3వ ప్రమాద హెచ్చరికను జారీ చేయడంతో జిల్లా కలెక్టర్ వెట్రిసెల్వి వేలేరుపాడులోనే ఉండి వరద పరిస్థితిని సమీక్షిస్తూ అధికారులను అప్రమత్తం చేస్తున్నారు. పోలవరంలో గోదావరి నీటిమట్టం శుక్రవారం సాయంత్రానికి స్వల్పంగా పెరిగి 24.027 మీటర్లకు చేరుకుంది. ధవళేశ్వరం వద్ద 24.42 మీటర్లకు చేరింది. 13 లక్షల క్యూసెక్కుల వరద జలాలు దిగువకు విడుదల చేసినట్లు, రెండవ ప్రమాద హెచ్చరిక జారీ చేసినట్లు ధవళేశ్వరం బ్యారేజి డీఈఈ రమేష్ తెలిపారు. పోలవరం ప్రాజెక్టు 48 గేట్ల ద్వారా 11,64,264 క్యూసెక్కుల వరద జలాలు దిగువకు విడుదల చేశారు. పట్టిసీమ ఎత్తిపోతల పథకం నుంచి కుడి కాలువకు 15 పంపులతో 5,310 క్యూసెక్కుల జలాలు విడుదల చేశారు.



వేలేరుపాడు సంతమార్కెట్ సెంటర్‌లో ఇళ్ళలోకి ప్రవేశించిన వరదనీరు

పశ్చిమలో.. ఉధృతి

రెండు రోజుల క్రితం కాస్త తగ్గిన గోదావరి శనివారం మధ్యాహ్నం నుంచి స్వల్పంగా పెరగడంతో ఆచంట మండలం కోడేరు, పెదమల్లం, కరుగోరుమిల్లి, భీమలాపురంలో ఉధృతంగా ప్రవహిస్తోంది. ఈ కారణంగా గోదావరిలో పడవలు నామమాత్రంగా తిరుగుతున్నాయి. లంక గ్రామాల్లో పల్లపు ప్రాంతాల్లో నీట మునగడంతో కొన్నిచోట్ల పశుగ్రాసం దెబ్బతింది. ఇక్కడ మూగ జీవాలకు పశుగ్రాసం ఇచ్చే ఏర్పాట్లు చేయాలని లంకవాసులు కోరుతున్నారు. యలమంచిలి మండలం కనకాయలంక కాజ్‌వే ఐదు రోజులుగా వరద ముంపులోనే ఉండటంతో ఆ గ్రామాల ప్రజలు ఇతర ప్రాంతాలకు వెళ్లేందుకు పడవలనే ఉపయోగిస్తున్నారు. వర్షాలు, వరదల ప్రభావంతో మురుగు కాలువలు ఉధృతంగా ప్రవహిస్తుండటంతో వరి చేలు ముంపులోనే ఉన్నాయి. ముఖ్యంగా లంకగ్రామాల్లో పాడి రైతులు పశువులకు పచ్చగడ్డి దొరకడం లేదని వాపోతున్నారు. మండలంలోని గ్రామాల్లో పుష్కర ఘాట్‌లు ముంపులోనే ఉన్నాయి. ఎగువ ప్రాంతాల్లో వరద పెరుగుతుందన్న సమాచారంతో లంకగ్రామాల ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. నరసాపురం వద్ద వశిష్ఠ గోదావరి వరద ఉధృతి తగ్గలేదు. పిండాల రేవు గుండా వరద నీరు సముద్రంలోకి దూసుకుపోతోంది. గంట గంటకు నీట మట్టాలు పెరుగుతున్నాయి. వరద పెరిగే అవకాశం ఉండటంతో అధికారులు అలర్ట్ అయ్యారు. రేవుల్లో ఎవరిని స్నానాలకు దిగనివ్వడం లేదు. వలంధర్ రేవు వద్ద పోలీస్ పికెట్ పెట్టారు. ఏటిగట్టుపై పహారా పెంచారు. బలహీనంగా ఉన్న గట్లపై ఇసుక బస్తాలను వేస్తున్నారు.



ఆదుకుంటాం

- బాధితులకు మంత్రుల భరోసా
- వరద ప్రభావిత ప్రాంతాల్లో పర్యటన

మేమున్నాం.. అధైర్యపడొద్దు.. మిమ్మల్ని అన్ని విధాలా ఆదుకుంటామంటూ మంత్రులు వరద బాధితులకు భరోసా ఇచ్చారు. కుక్కునూరు, వేలేరుపాడు మండలాల్లో శనివారం మంత్రులు అచ్చెన్నాయుడు, డాక్టర్ నిమ్మల రామానాయుడు, కొలుసు పార్థసారథి, వంగలపూడి అనిత, ఎమ్మెల్యేలు చిర్రి బాలరాజు, చింతమనేని ప్రభాకర్, టీడీపీ జిల్లా అధ్యక్షుడు గన్ని వీరాంజనేయులు, మాజీ ఎమ్మెల్యే ఘంటా మురళి పర్యటించి వరద బాధితులను పరామర్శించారు. వారికి క్షేత్ర స్థాయిలో అందుతున్న సౌకర్యాలపై ఆరా తీసి నిత్యావసరాలు, ఆర్థిక సాయం అందించారు. దావారంలో వరద బాధితులతో సమావేశమై సమస్యలు తెలుసుకున్నారు. -7లో



ఇసుక మంట

స్టాక్ పాయింట్లలో బ్లాక్ మార్కెట్ దందా

- బిల్లు రూ.4900.. వసూలు రూ.11 వేలు
- కొంత సొమ్ము స్థానిక ప్రజా ప్రతినిధి కోసమట!
- లారీ ఇసుక : ఏలూరులో రూ.26 వేలు, భీమవరంలో రూ.23 వేలు.. వినియోగదారుల బెంబేలు..

పాలకొల్లు, జూలై 27 : ఉచిత ఇసుక బ్లాక్ మార్కెట్ పరమైంది. సామాన్యులకు అందని ద్రాక్షగా మారుతోంది. పది రోజులుగా ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల్లో రావులపాలెం స్టాక్ పాయింట్ మినహా మిగిలిన అన్నిచోట్ల ఇసుక ఎగుమతులు నిలిచిపోయాయి. ఇక్కడ మాత్రం రోజుకు 200 లారీల ఇసుక ఎగుమతి అవుతోంది. లోడింగ్, ట్రాన్స్‌పోర్టు చార్జీల నిమిత్తం రూ.4,900 వసూలు చేయాలి. అంతే మొత్తంలో బిల్లు ఇస్తూ రూ.11 వేలు వసూలు చేస్తున్నారు. దీనిపై ప్రశ్నిస్తే ఇలా వసూలు చేసిన మొత్తంలో అక్కడి ఓ ప్రజా ప్రతినిధికి రూ.6,100 ఇస్తున్నామని స్టాక్ పాయింట్ సిబ్బంది చెబుతున్నట్టు లారీ ఓనర్లు చెబుతున్నారు. ఈ లెక్కన రోజుకు 200 లారీల ఇసుక ఎగుమతివుతుంటే రూ.12 లక్షలు ఆ నేత జేబులోకి వెళుతోందన్న మాట.

రూ.20 వేలు పైమాటే

తూర్పు, పశ్చిమ, కోనసీమ జిల్లాల్లోని స్టాక్ పాయింట్లు, పడవల ర్యాంపుల్లో ఇసుక ఎగుమతులు నిలిచిపోవడంతో రావులపాలెం స్టాక్ పాయింట్ సిబ్బంది ఇష్టానుసారం వసూలు చేస్తున్నారు. 20 టన్నుల ఇసుక లారీ (4.5 యూనిట్లు) ఏలూరులో రూ.26 వేలు, తాడేపల్లిగూడెం, భీమవరంలలో రూ.27 వేలు, పాలకొల్లు, నరసాపురం రూ.21 వేలకు అన్‌లోడ్ చేస్తున్నారు. జగన్ సర్కార్ హయాంలో వరదల సమయంలోనే ఐదు యూనిట్ల ఇసుక లారీ రూ.18 వేలకు మించి లేదు. ఇప్పుడు ఉచితం అంటూ నిలువుదోపిడీ చేస్తున్నారంటూ విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇప్పటికే 20 రోజులుగా వర్షాలు, ఇసుక కొరతతో నిర్మాణ పనులకు ఆటంకం ఏర్పడింది. ఈ విషయాలపై ఫిర్యాదులు రావడంతో సీఎం పేషీ దృష్టి సారించి బిల్లుకన్నా అదనంగా వసూలు చేస్తున్న వైనంపై సంబంధిత అధికారుల నుంచి వివరణ కోరినట్లు సమాచారం.

సీఎం దృష్టికి వ్యవహారం

వరదలు తగ్గుముఖం పట్టి, గోదావరి ర్యాంపులలో బాటల ఏర్పాటుకు మరో రెండు నెలలు సమయం పడుతుంది. అప్పటి వరకు ఇసుక అమ్మకాల తీరు ఇలాగే కొనసాగితే అభాసుపాలవుతామని తమ కూటమి ప్రభుత్వానికి చెడ్డ పేరు వస్తుందని, ఇప్పటికే సీఎం దృష్టికి పలువురు ప్రజా ప్రతినిధులు తీసుకుని వెళ్లారు. మరోవైపు పెండ్యాల, తీపర్రు, కుమారదేవం, స్టాక్ పాయింట్లలో శనివారం నుంచి ఇసుక ఎగుమతులు ప్రారంభించారు. ఇసుక ఎగుమతులకు వెళ్లిన లారీలు రోజుల తరబడి స్టాక్ పాయింట్లలో వేచి ఉండటం, వెయిటింగ్ పిరియడ్‌కి కిరాయి అదనంగా వసూలు చేస్తుండగా ఎక్కువ సొమ్ములు వసూలు చేస్తున్నారనే చెడ్డ పేరును ట్రాన్స్‌పోర్టర్లకు అంటగడుతున్నారనే అంశాలను టిప్పర్ లారీ యజమానాలు ఆయా జిల్లాల కలెక్టర్ల దృష్టికి తీసుకువచ్చారు.

జరభద్రం



- వర్షాకాలంలో పెరుగుతున్న పాముకాటు కేసులు
- బాధితుల్లో అత్యధికులు రైతులు, వ్యవసాయ కూలీలే

పోలవరం, జూలై 27 : వర్షాకాలం వచ్చిందంటే పాము కాటు కేసులు ఎక్కువగా నమోదవుతాయి. వర్షాలకు పొదలు, అడవులు, పుట్టలు వర్షపు నీటితో నిండి ఉంటాయి. ఈ సందర్భాల్లో పాముల ఆవాసాలు నీటితో నిండిపోవడంతో ప్రాణ రక్షణ కోసం, ఆహారం కోసం సమీప జనావాసాల్లోకి, పంటచేలల్లోకి చేరతాయి. ఎలుకలు, కప్పలు వంటి వాటి ఆహారాల కోసం ధాన్యపు గాదెలు, గడ్డి మేట్లు, పొలం గట్లపైకి, ఆకుమడుల్లోకి తరలి వస్తాయి. అది గమనించని రైతులు, వ్యవసాయ కూలీలు, నివాసాల్లో మహిళలు, పిల్లలు తరచూ పాము కాటుకి గురవుతూ ఉంటారు. నిజానికి రైతులకు పాములు మేలు కూడా చేస్తాయి. పంట పొలాల్లో ఎలుకలు చేసే పంట నష్టం అంతా ఇంతా కాదు. కలుగుల్లో దాగివున్న ఎలుకలను పాములు ఆహారంగా తీసుకోవడం ద్వారా పాములు రైతుకు ఎంతో ఉపయోగపడతాయి. అలా అని అప్రమత్తంగా లేకుంటే రైతులకు ప్రమాదం ఎదురవ్వొచ్చు. ప్రపంచంలో 3,789 పాము జాతులుండగా మన దేశంలో 740 జాతులు ఉన్నాయి. వీటిలో అత్యంత ప్రమాదకరమైన, విషపూరితమైనవి 72 మాత్రమే. అదే ఉమ్మడి పశ్చిమ జిల్లాలో ఎనిమిది విషపూరితమైన పాములున్నాయి.

ఈ జాగ్రత్తలు తీసుకోండి

ఈ వరదలు, వర్షాకాలం సీజనులో పాముకాటు, విషకీటకాల బారిన పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. నివాసాల వద్ద గుబురుగా పొదలు పెరగనీయరాదు. ఎలుకలు, కప్పలు, తొండలు వంటి పాముల ఆహారాలు చేరకుండా నివాసాలు, ధాన్యపు గాదెల వద్ద బ్లీచింగ్, గమాక్సిన్ లాంటి ఘాటైన వాసన కలిగించే పౌడర్లు జల్లడం చేయడం వల్ల పాములు, విషకీటకాలు రాకుండా నివారించవచ్చు. పొలం పనులకు వెళ్లే రైతులు, వ్యవసాయ కూలీలు, చేలగట్ల మీద నడిచేటప్పుడు పొడవాటి కర్ర తీసుకుని శబ్దం చేసుకుంటూ వెళ్లడం వల్ల పాములు విషకీటకాలు ఉంటే పక్కకు తప్పుకుంటాయి. కాళ్ళకు చెప్పులు, చీలమండల వరకు జీన్ ఫ్యాంటు లాంటి వస్త్రాలు ధరించడం లేదా అరికాలి నుంచి మోకాలి దాకా శరీరాన్ని కప్పి ఉంచే గమ్ బూట్లు ధరించడం శ్రేయస్కరం.చీకటిలో వెళ్ళే సందర్భంలో తప్పనిసరిగా టార్చిలైట్లు వాడాలి.

పాము కాటు వేస్తే..

పాముల్లో తల త్రికోణాకారం ఉన్న పాములు మరింత విషపూరితం. వాటిలో నాగుపాము (కోబ్రా) , కట్ల పాము (క్రైయిట్) , పొడ లేదా పింజరి (వైపర్) ఈ జాతుల పాములు కాటు వేసిన వెంటనే కాటు వేసిన ప్రాంతంలో సబ్బుతో కడిగి ఏదైనా వాహనంలో సమీపంలో ఉన్న ఆస్పత్రికి తరలించాలి. మంత్రాలు నాటు మందుల పేరిట జాప్యం చేస్తే ప్రాణాలకు హాని కలిగే అవకాశం ఉంటుంది. ప్రతి ప్రభుత్వ ఆస్పత్రిలో పాముకాటు విరుగుడు ఇంజక్షన్లు (యాంటీవీనమ్) అందుబాటులో ఉన్నాయి. ముఖ్యంగా పాము కాటుకి గురైన వ్యక్తికి మానసిక ధైర్యం అందించి వైద్యానికి తీసుకువెళ్ళాలి. చాలా పాముకాటు మరణాలకు విషం ప్రభావం కంటే ఆందోళనతో గుండెపోటు రావడమే కారణాలుగా నిలిచాయి.

ఉమ్మడి జిల్లాలో 300 పాము కాట్లు

ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలో ఏటా మూడు వందలకుపైగా పాము కాటు కేసులు నమోదవుతున్నాయి. వీటిలో సుమారు 80 మంది వరకు మృత్యువాత పడుతుండగా వీరిలో రైతులే ఎక్కువగా ఉంటున్నారు. వర్షాకాలంలో రైతులు పొలాల్లోకి వెళ్లేటప్పుడు తగిన జాగ్రత్తలు తీసుకోవాలి.

పాముకాటుతో ఇద్దరు రైతులకు అస్వస్థత

మండలంలో పాముకాటుతో శనివారం ఇద్దరు రైతులు అస్వస్థతకు గురయ్యారు. పోలవరం ప్రభుత్వ సామాజిక వైద్య ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి కృష్ణంరాజు తెలిపిన వివరాల ప్రకారం పట్టిసీమకు చెందిన పోశీరావు, రామయ్యపేటకు చెందిన దుర్గాప్రసాద్ పాముకాటుకు గురయ్యారని వారికి చికిత్స అందించినట్లు తెలిపారు. మండలంలో ఈ ఏడాది జూన్‌లో మూడు పాముకాటు కేసులు, జూలైలో 15 పాముకాటు కేసులు నమోదయ్యాయి. వాటిలో 15 కేసులు విషపూరిత పాము కాట్లు కాగా మిగతావి సాధారణ పాముకాటు కేసులని తెలిపారు.



పాముకాటుతో చికిత్స పొందుతున్న రైతు

నామినేటెడ్ పోటాపోటీ!



ఇంతకు ముందు మాదిరిగా ఒకరిద్దరి పేర్లతో నామినేటెడ్ పోస్టులు భర్తీ చేసే అవకాశం లేదు. నియోజకవర్గాల వారీగా ఎక్కడైతే ఖాళీలు ఉన్నాయో ముందుగా నిర్ధారించి ఆ తరువాతే సిట్టింగ్ ఎమ్మెల్యే ఏ పార్టీకి చెందిన వారు అయితే ఆయా నామినేటెడ్ పోస్టుల్లో ఆ పార్టీ వారికి 60 శాతం, మిగతా 40 శాతం మిగతా పార్టీల్లో వారికి అవకాశం ఇవ్వాలని ఇప్పటికే కూటమి కీలక నిర్ణయం తీసుకుంది. నియోజకవర్గాల్లో ఎమ్మెల్యే తర్వాత అంతే హోదాలో ఉండే నామినేటెడ్ పోస్టు మార్కెట్ కమిటీ చైర్మన్ పదవి. ఇప్పుడు దానికోసమే అన్ని పార్టీల్లోనూ వివిధ స్థాయిల్లోని నేతలు పోటీలు పడుతున్నారు.

-ఏలూరు-ఆంధ్రజ్యోతి ప్రతినిధి

- మార్కెట్ కమిటీలే కీలకంగా భావిస్తున్న కూటమి నేతలు
- సీనియర్లు, జూనియర్లది ఒకటే ఆశ..బాట

నియోజకవర్గాల్లో ఇదే ఆశ

ఎన్నికల సమయంలోనే కొందరు సీనియర్లతో పాటు జూనియర్లకు కూటమి అధికారంలోకి వచ్చిన వెంటనే తగిన గౌరవం ఉన్న పదవిలో మేము మిమ్మల్ని కూర్చోబెడతాం.. అంటూ కూటమి నేతలు హామీలు ఇచ్చారు. ఇప్పుడు నామినేటెడ్ పోస్టులు భర్తీకి సీఎం చంద్రబాబు నాయుడుతో పాటు కూటమిలో మిగతా నేతలు ఒక నిర్ణయానికి వచ్చారు. ప్రతి నియోజకవర్గంలోనూ ఎవరైతే సిట్టింగ్ ఎమ్మెల్యేగా ఉంటారో, వారు ఏ పార్టీకి చెందిన వారు అయి ఉంటే నామినేటెడ్ పోస్టుల భర్తీలో అక్కడ ఆ పార్టీకి 60 శాతం, మిగతా 30 శాతం ఒక పార్టీకి, పదిశాతం ఇంకో పార్టీకి దామాషా పద్ధతిలో కేటాయించాల నేది ఒక సారాంశం. ఎలాగో కార్పొరేషన్లు లెక్కకు మిక్కిలిగా ఉన్నాయి. వాటితో పాటు దేవాలయాలు, ఇతరత్రా పదవు లకు కొదువేలేదు. కాని నియోజకవర్గాల్లో ఇప్పటికే నేతల దృష్టి అంతా మార్కెట్ కమిటీల మీద పడింది. ఎందు కంటే మార్కెట్ కమిటీ చైర్మన్‌గా ఎవరైతే ఉంటారో ఆ నియోజకవర్గంలో ఎమ్మెల్యేతో సమానంగా ప్రోటోకాల్ వర్తిస్తుంది. అదికాక దాదాపు ఇప్పటి వరకు ఆ పదవి నిర్వహించిన వారంతా నెంబర్-2గానే నియోజకవర్గాల్లో కొనసాగుతూ వచ్చారు. ఇప్పుడు ఆ పదవికోసం కూటమి నేతల మధ్య అక్కడక్కడ పోటీ నెలకొంది. ఏలూరు, దెందులూరు, చింతలపూడి, నూజి వీడు నియోజక వర్గాల్లో టీడీపీ ఎమ్మెల్యేలు గెలుపొందగా, పోలవరం, ఉంగుటూరులో జనసేన ఎమ్మెల్యేలు గెలుపొందారు. కైకలూరు స్థానం నుంచి బీజేపీ అభ్యర్థిగా డాక్టర్ శ్రీనివాస్ గెలు పొందారు. ఈ నేపథ్యంలో ఎక్కడికక్కడ ఇప్పటికే గత ఎన్నికల్లో ప్రాణా లకు తెగించి పనిచేసిన సీనియర్లతో పాటు జూనియర్లకు నామినేటెడ్ పదవుల్లో అవకాశం ఇవ్వాలని, ఇప్పటికే సిట్టింగ్ ఎమ్మెల్యేలు ఒక భావనకు వచ్చినా ఎవరిని నొప్పించకుండా జాగ్రత్త పడుతున్నారు. పార్టీ ముఖ్యులు చెప్పింది వినటమే కాని దీనిపై చర్చకు ఏ ఎమ్మెల్యే సాహసించడం లేదు. నియోజకవర్గ స్థాయిలో మార్కెట్ కమిటీ చైర్మన్, డైరెక్టర్ పదవులను ఇంతకు ముందు వైసీపీ వివిధ వర్గాలతో పాటు మహిళలకు ప్రాధాన్యత ఇచ్చింది. ఇప్పుడు కూటవి నిర్ణయం ఏ విధంగా ఉంటుందో అన్నది సస్పెన్స్.

'మార్కెట్' హుషారు

వివిధ నియోజకవర్గాల్లో మార్కెట్ కమిటీ చైర్మన్ పదవి ఆశిస్తున్న వారి సంఖ్య పెద్దసంఖ్యలోనే ఉంది. ఏలూరు అసెంబ్లీ నియోజకవర్గంలో దాదాపు అరడజను మందికి పైగానే మార్కెట్ కమిటీ చైర్మన్ పదవి ఆశిస్తున్నారు. వీరిలో సీనియర్లే అధికం. ప్రత్యేకించి టీడీపీ ఎమ్మెల్యే ఇక్కడ గెలిచారు కాబట్టి, మార్కెట్ కమిటీ చైర్మన్ పదవితో పాటు వివిధ దేవాలయాలు, ఇతరత్రా కమిటీల చైర్మన్ల పద వులు అత్యధికం టీడీపీకే దక్కే అవకాశం ఉంది. చైర్మన్ పదవి నిమిత్తం పూజారి నిరంజన్, లింగిశెట్టి శశికుమార్, ఆర్నేపల్లి మధు, నెరుసు గంగరాజు, కొట్టు మధుతో పాటు కంచన జయరాజు పేర్లు ఇప్పటికే ప్రచారంలో ఉన్నాయి. వీరిలో కొట్టు మధు, దివంగత ఎమ్మెల్యే బడేటి బుజ్జికి వియ్యంకుడు. పూజారి నిరంజన్ ఒక పర్యాయం చైర్మన్‌గా వ్యవహరించారు. మిగతా వారంతా పార్టీకి పూర్తి సమయం కేటాయించి శ్రమించారు. కేడర్‌లోనూ వీరికి కొంత ఆమోదముద్ర లేక పోలేదు కాని ఎమ్మెల్యే చంటి తన మనస్సులోని మాట బయటపడకుండా జాగ్రత్త పడుతున్నారు. దెందులూరు నియోజకవర్గంలో క్లస్టర్ ఇన్‌చార్జ్ తాతా సత్యనారా యణ పేరు దెందులూరు మార్కెట్ కమిటీకి ప్రముఖంగా వినిపిస్తోంది. అయితే పెదపాడు మండలానికి ఈ సారి చైర్మన్ పదవి కేటాయించాలని ఆ మండల నేతలు ఇప్పటికే ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్‌పై ఒత్తిడి తెస్తున్నారు. పైకి బయటపడక పోయినా మాజీ జడ్పీటీసీ గారపాటి సీత ఈ పదవిని ఆశి స్తున్న ట్టు తెలుస్తోంది. జనసేన పక్షాన ఘంటసాల వెంకటలక్ష్మి, కొఠారి ఆదిశేషు లు సైతం తమ ప్రయత్నాల్లో ఉన్నారు. ఈ నియోజకవర్గంలో కూడా మార్కెట్ కమిటీ చైర్మన్ పదవి టీడీపీకే దక్కే అవకాశం ఉంది. చింతలపూడి నియోజక వర్గంలో మార్కెట్‌కమిటీ చైర్మన్ పదవిని ఆశిస్తున్న వారి సంఖ్య భారీగానే ఉంది. వీరిలో లింగపాలెం మాజీ జడ్పీటీసీ గుత్తావరప్రసాద్ (పెదబాబు), కిలారు సత్యనారాయణ, చందు శ్రీనివాస్ యాదవ్, మరీ దు వెంకట్రావు, అబ్బిన దత్తాత్రేయ, సూరనేని గోపి పేర్లు ప్రముఖంగా వినిపిస్తున్నాయి. టీడీపీ ఎమ్మెల్యే సొంగా రోషన్ కుమార్ నిర్ణయాన్ని బట్టి ఈ పదవి ఎవరికి ఇస్తారు అనేది తేలబోతోంది. జనసేన పక్షాన కూడా ఆ పార్టీ నియోజక వర్గ ఇన్‌చార్జ్ మేకా ఈశ్వరయ్య తో పాటు వి.నాగ విజయ్ కుమార్, మధుబాబు ఆశిస్తున్నారు. ఆ మేరకు జనసేన పార్టీ నాయకత్వంపై ఒత్తిడి తేవాలని భావిస్తున్నారు. పోల వరం, ఉంగుటూరు నియోజకవర్గాల్లోనూ మార్కెట్ కమిటీల కోసం కొంత పోటాపోటీ వ్యవహారం నెలకొంది. ఉంగుటూరు నుంచి జనసేన పక్షాన ఎమ్మెల్యేగా పత్సమట్ల ధర్మరాజు గెలుపొందా రు. అయినా టీడీపీ పక్షాన పార్టీలో సీనియర్లు అయిన పాతూరి విజయ్ కుమార్, చింతల శ్రీనివాస్ చైర్మన్ పదవి ఆశిస్తున్న వారిలో ఉన్నారు. ఎన్నికల సమయంలోనే ఈ మేరకు కొంత టీడీపీ, జనసేన మధ్య ఒక అవగాహన ఉన్నట్లు ప్రచారం సాగింది. ఇప్పుడు ఎలాగో సిట్టింగ్ ఎమ్మెల్యే జనసేన పక్షానికి చెందిన ధర్మరాజు ఉంటారు కాబట్టి ఆయన నిర్ణయమే తుది నిర్ణయం కాబోతుంది. కైకలూరులో సిట్టింగ్ ఎమ్మెల్యేగా బీజేపీకి చెందిన డాక్టర్ కామినేని శ్రీనివాస్ ఉన్నారు. ఈ నియోజకవర్గంలో చైర్మన్ పదవి కోసం టీడీపీ పక్షాన సీనియర్ నేత పెనుమత్స త్రినాథ్‌రాజు, పి.రామచంద్ర రావు ఆశలు పెంచుకున్నారు. కలిదిండి మార్కెట్‌కమిటీలో చైర్మన్‌గా బీజేపీ పక్షాన మురళీ కృష్ణతో పాటు తోకల జోగిరాజు, శ్రీనివాసరావులు పోటీ పడుతున్నారు.

మంత్రి నియోజకవర్గంలో ..

నూజివీడు నియోజకవర్గం నుంచి మంత్రి కొలుసు పార్థసారథి ప్రాతినిధ్యం వహిస్తుండగా, ఈ నియోజకవర్గంలో మార్కెట్ కమిటీ చైర్మన్ పదవి కోసం ఆశిస్తున్న నేతల సంఖ్య భారీగానే ఉంది. వీరిలో కాపా శ్రీనివాస్, ఢలరామ్, చిట్నేని శివరామకృష్ణ, మోరంపూడి శ్రీను, అక్కినేని చంద్రశేఖర్ గట్టిగా ప్రయత్నిస్తున్నారు. వీరిలో కాపా శ్రీనివాస్ ఇంతకు ముందు ఒకసారి చైర్మన్‌గా వ్యవహరించారు. వీరితో పాటు జనసేన పక్షం నుంచి నియోజకవర్గ ఇన్‌చార్జ్ బర్మాపణిబాబు, మరీదు శివరామకృష్ణ ఆశిస్తున్నారు. అయితే ఈ నియోజక వర్గంలో చైర్మన్ పదవికోసం పోటీ తీవ్రంగా ఉండడంతో మంత్రి పార్థసారథి ఆచితూచి నిర్ణయం తీసుకునే అవకాశం ఉంది.

విద్యుత్ పునరుద్ధరణ పనులు వేగవంతం

- ఏపీఈపీడీసీఎల్ సీఎండీ పృథ్వీతేజ



ముంపు గ్రామాలకు బోటులో వెళ్తున్న ఏపీఈపీడీసీఎల్ సీఎండీ పృథ్వీతేజ, విద్యుత్ అధికారులు

కుక్కునూరు/వేలేరుపాడు, జూలై 27 : పెద్దవాగు వరదకు జంగారెడ్డిగూడెం విద్యుత్ డివిజన్ పరిధి కుక్కునూరు, వేలేరుపాడు మండలాల్లో ముంపనకు గురైన పలు గ్రామాల్లో యుద్ధప్రతిపాదికన విద్యుత్ పునరుద్ధరణ పనులు చేపడుతున్నట్టు ఏపీ తూర్పు ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ ఇమ్మడి పృథ్వీతేజ తెలిపారు. కలెక్టర్ వెట్రిసెల్వితో శనివారం విద్యుత్ పునరుద్ధరణ పనులపై చర్చించారు. మేడేపల్లి, అల్లూరినగర్, కోయమాదారం, ఊటగుంపు, గుళ్లవాయి గ్రామాలను సందర్శించి విద్యుత్ పునరుద్ధరణ పనులను పరిశీలించారు. వేలేరుపాడు మండంలంలో గోదారి వరదల కారణంగా మరో 30 గ్రామాలు జలదిగ్బంధంలో చిక్కుకోవడంతో అనేక చోట్ల విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. ప్రత్యక్షంగా పరిశీలించే నిమిత్తం గోదావరిలో బోటులో ప్రయాణించి విద్యుత్‌లైన్లను పరిశీలించారు. విద్యుత్ సరఫరాకు ఇబ్బందులు లేని గ్రామా లకు విద్యుత్ సరఫరా పునరుద్ధరణ చర్యలను చేపట్టారు. విద్యుత్ సరఫరాకు వీలుపడని గ్రామాల్లో 12 జనరేటర్లను ఏర్పాటు చేసి ప్రజలకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకున్నారు. ఎస్ఈ సాల్మన్‌రాజు, ఈఈ రాధాకృష్ణ, ఇతర విద్యుత్‌శాఖాధికారులు పాల్గొన్నారు.

గ్రామాల్లో 'టీమ్ ఏలూరు'

- విపత్కర పరిస్థితుల్లో సాయం చేసేందుకు ముందుకు రండి
- కొత్త పద్ధతికి నాంది పలికిన కలెక్టర్ వెట్రిసెల్వి

7



అధికారులతో మాట్లాడుతున్న డీఆర్వో ఉదయ భాస్కరరావు

నేటి నుంచి ఏపీపీఎస్సీ డిపార్ట్‌మెంట్ పరీక్షలు

ఏలూరు రూరల్/ భీమవరం టౌన్, జూలై 27: ఏపీపీఎస్సీ డిపార్ట్‌మెంట్ పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలని ఏలూరు ఆర్డీవో ఎన్.ఎస్.కె ఖాజావలీ, పశ్చిమ గోదావరి జిల్లా రెవెన్యూ అధికారి జె.ఉదయ భాస్కరరావు వేర్వేరు సమావేశాల్లో అధికారులకు సూచించారు. ఈనెల 28 నుంచి నిర్వహించే పరీక్షలపై పోలీస్, విద్యుత్, వైద్యశాఖ పరీక్షాకేంద్రాల చీఫ్ సూపరింటెండెంట్‌లు, లైజన్ అధికారులతో శనివారం ఆయా జిల్లా కేంద్రాల్లో సమావేశం నిర్వహించారు. ఈనెల 28 నుంచి ఆగస్ట్ 2వ తేదీ వరకు పరీక్షలు జరుగుతాయని తెలిపారు. ఏలూరు జిల్లాలో 1052 మంది, పశ్చిమలో 860 మంది పరీక్షలు రాయనున్నారు.ఆబ్జెక్టివ్ విధానంలో పరీక్షాపత్రం ఉంటుందన్నారు.ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు తిరిగి మధ్యాహ్నం 3 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు పరీక్షలు జరుగుతాయని, గంట ముందు కేంద్రానికి హాజరు కావాలన్నారు. వట్లూరు సిద్ధార్థ పాఠశాల, భీమవరంలో డీఎన్ఆర్ కళాశాల, తాడేపల్లిగూడెం వాసవీ ఇంజనీరింగ్ కళాశాలలో పరీక్షలు జరుగుతాయి.

భీమవరంలో రాష్ట్ర స్థాయి చదరంగం పోటీలు



పోటీలను ప్రారంభిస్తున్న ప్యాడీ అండ్ రైస్ మర్చంట్ అసోసియేషన్ అధ్యక్షుడు

భీమవరం అర్బన్, జూలై 27: చదరంగం ద్వారా మేధాశక్తి పెరుగుతుందని ప్యాడీ అండ్ రైస్ మర్చంట్ అసోసియేషన్ అధ్యక్షుడు చవాకుల నరసింహారావు అన్నారు. జిల్లా చెస్ అసోసియేషన్, అనసూయ చెస్ అకాడమీ ఆధ్వర్యంలో అండర్ 11 రాష్ట్ర స్థాయి చదరంగం పోటీలు భీమవరం ప్యాడీ అండ్ రైస్ మర్చంట్ అసోసియేషన్ భవనంలో శనివారం ప్రారంభమయ్యాయి. అసోసియేషన్ కోశాధికారి జ్వాలాముఖి మాట్లాడుతూ ఈ పోటీల్లో గెలుపొందిన విజేతలు తెలంగాణలో జరిగే జాతీయ స్థాయి పోటీలకు ఎంపికవుతారని తెలిపారు. జిల్లా చెస్ అసోసియేషన్ అధ్యక్షుడు మాదాసి కిషోర్ మాట్లాడుతూ 20 జిల్లాల నుంచి 150 మంది క్రీడాకారులు ఈ పోటీలో పాల్గొన్నారన్నారు. రాష్ట్ర చదరంగం అసోసియేషన్ సంయుక్త కార్యదర్శి ఉదయ్ కుమార్, విజ్ఞాన వేదిక సేవ సంస్థ అధ్యక్షుడు అల్లు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఆగస్టు 3,4 తేదీల్లో జాతీయస్థాయి నర్తనబాల అవార్డుల ప్రదానం



బ్రోచర్ ఆవిష్కరించిన ఎమ్మెల్యే బడేటి చంటి

ఏలూరు రూరల్, జూలై 27: ఏలూరుకు చెందిన అభినయ నృత్యభారతి ఆధ్వర్యంలో ఆగస్టు 3,4 తేదీల్లో వైఎంహెచ్ఏ ప్రాంగణంలో జాతీయ స్థాయి నర్తన బాల అవార్డుల మహోత్సవం నిర్వహిస్తున్నట్లు గౌరవ అధ్యక్షుడు అంబికా కృష్ణ, వ్యవస్థాపక అధ్యక్ష కార్యదర్శులు మనోహర్ గోపాల్ లూనాని, జి.హేమసుందర్ తెలిపారు. రెండు రోజుల పాటు ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 8 గంటల వరకు ఉభయ తెలుగు రాష్ట్రాలకు చెందిన 40 మంది నాట్యగురువుల శిష్యులు 170 మంది నృత్య ప్రదర్శనలు చేయనున్నారని వారికి సంస్థ తరఫున నర్తనబాల అవార్డుతో సత్కరిస్తామన్నారు. ఏలూరు ఎమ్మెల్యే బడేటి చంటి, చింతలపూడి ఎమ్మెల్యే సొంగా రోషన్‌కుమార్, ఎమ్మెల్సీ వంకా రవీంద్రనాథ్ తదితరులు హాజరవుతారన్నారు. బ్రోచర్‌ను ఏలూరు ఎమ్మెల్యే బడేటి చంటి ఆవిష్కరించారు.

ఆదుకుంటాం..

“ వరదల కారణంగా ఇబ్బందులు పడుతున్న బాధితుల దగ్గరకు వెళ్లండి.. ఇప్పటి వరకు అందిన సాయం..? ఇంకా ఏం కావాలో తెలుసుకోండి.. అని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆదేశించారు. అందుకే మేమంతా కలిసి వచ్చాం..” అని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు, జలవనరుల శాఖ మంత్రి డాక్టర్ నిమ్మల రామానాయుడు, హోం మంత్రి వంగలపూడి అనిత, గృహ నిర్మాణ శాఖ మంత్రి కొలుసు పార్థసారథి అన్నారు. శనివారం మంత్రుల బృందం ఉమ్మడి జిల్లాలోని వరద ప్రభావిత ప్రాంతాల్లో పర్యటించారు.. బాధితులను పరామర్శించి వారికి సాయం అందిస్తామని చెప్పారు.

ఇది ప్రజా ప్రభుత్వం..సేవ చేసేందుకే ఉన్నాం

జగన్ ప్రభుత్వ నిర్లక్ష్యం వల్లే ఈ కష్టాలు

వరద ప్రభావిత ప్రాంతాల్లో పర్యటించిన మంత్రులు అచ్చెన్నాయుడు, రామానాయుడు, పార్థసారథి, అనిత

ఆదుకుంటామంటూ బాధితులకు భరోసా

కుక్కునూరు, జూలై 27: తమది ప్రజా ప్రభుత్వమని ప్రజలకు ఏ ఇబ్బందులు తలెత్తినా తక్షణమే స్పందిస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వరద ప్రభావిత ప్రాంతాల్లో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా తక్షణ చర్యలు తీసుకోవాలని ఆదేశించటంతో ప్రజల ఇబ్బందులు తెలుసుకుంటున్నామని మంత్రి అచ్చెన్నాయుడు అన్నారు. దాచారం పునరావాస కాలనీలో బాధితులతో మంత్రి అచ్చెన్నాయుడు మాట్లాడుతూ వరద ముంపు బాధితులకు పూర్తిస్థాయిలో సహాయం అందించాలని సీఎం ఆదేశాలు జారీ చేశారన్నారు. వరద ప్రమాదం తగ్గిన తరువాత బాధితులను ఇంటి వద్దకు క్షేమంగా చేరేలా అధికారులు చర్యలు తీసుకుంటారన్నారు. మంత్రి డాక్టర్ నిమ్మల రామానాయుడు మాట్లాడుతూ పెదవాగు ప్రాజెక్టు ద్వారా 14 వేల ఎకరాలు ఆంధ్రప్రదేశ్‌లో సాగవుతుందని పెదవాగు ప్రాజెక్టు మరమ్మతులకు, గోదావరి బోర్డు 85 శాతం ఆంధ్రప్రదేశ్, 15 శాతం తెలంగాణ ప్రభుత్వం నిధులు కేటాయించాల్సి ఉందన్నారు. అయితే 80 కోట్ల రూపాయలు మరమ్మతులకు అంచనాలు రూపొందించగా గత ప్రభుత్వం తన వాటా చెల్లించకుండా పెడచెవిన పెట్టిందన్నారు. ఆ నిర్లక్ష్యం కారణంగా ప్రస్తుతం ప్రాజెక్టు కొట్టుకుపోవడంతో ప్రజలు ఎన్నో ఇబ్బందులు పడుతున్నారన్నారు. పెదవాగు ప్రాజెక్టు మరమ్మత్తులకు ప్రణాళికలు రూపొందించి బడ్జెట్ కేటాయిస్తామన్నారు. మంత్రి పార్థసారధి మాట్లాడుతూ గోదావరి వరదల కారణంగా నష్టపోయిన ప్రతీ కుటుంబాన్ని ఆదుకుంటామన్నారు. మంత్రి అనిత మాట్లాడుతూ రాష్ట్ర ప్రజలకి ఎంతో మేలుచేసే పోలవరం ప్రాజెక్టు కోసం భూములు త్యాగం చేసిన నిర్వాసితులకు నష్టపరిహారం త్వరితగతిన అందించేందుకు ముఖ్యమంత్రి కృతనిశ్చయంతో ఉన్నారని అన్నారు. కలెక్టర్ వెట్రిసెల్వి, ఎస్పీ కే.ప్రతాప్ శివకిషోర్, జాయింట్ కలెక్టర్ ధాత్రిరెడ్డి, పోలవరం ఎమ్మెల్యే చిర్రి బాలరాజు, దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్, జడ్పీ సీఈవో సుబ్బారావు, డీపీవో శ్రీనివాస విశ్వనాథ్, డ్వామా పీడీ రాము తదితరులు పాల్గొన్నారు.



ఇల్లిందలపర్రులో కుళ్లిన వరి దుబ్బులను మంత్రులకు చూపిస్తున్న రైతులు

ప్రజలకు ఏ ఇబ్బందులు రానివ్వం..

వేలేరుపాడు : వేలేరుపాడు మండలంలోని కన్నాయిగుట్ట గ్రామంలో వరద పరిస్థితిని మంత్రులు పరిశీలించారు. వరదల కారణంగా ప్రభుత్వపరంగా అందిస్తున్న సాయంపై ఆరా తీశారు. ఇప్పటి వరకు జిల్లా కలెక్టర్‌తో సహా అధికారులంతా తమను బాగానే చూసుకుంటున్నారని బియ్యం, నిత్యావసర సరుకులు అందించారని ప్రజలు చెప్పడంతో మంత్రులు సంతృప్తి వ్యక్తం చేశారు. వరద చుట్టుముట్టిన గ్రామాల ప్రజలకు కుటుంబానికి రూ.3 వేలు చొప్పున సాయం అందిస్తామని మంత్రులు చెప్పడంతో గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు. గతంలో కొంతమందికే ఆర్అండ్ఆర్ ప్యాకేజీ ఇచ్చారని ఇంకా 65 కుటుంబాలకు తమ గ్రామంలో ఆర్అండ్ఆర్ ప్యాకేజీ ఇవ్వాల్సి ఉందని గిరిజనులు మంత్రులకు విన్నవించారు. తమ ప్రభుత్వం కొత్తగా వచ్చిందని కొంచెం కుదుటపడ్డాక అందరికీ ప్యాకేజీ చెల్లిస్తామని కొంచెం ఓపిక పట్టాలని సూచించారు. అనంతరం శివకాశీపురం ఆశ్రం పాఠశాలలో అధికా రులతో సమీక్ష నిర్వహించి వరదలు తీవ్రమైతే తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు.

దువ్వలో...

తణుకు : తణుకు మండలం దువ్వ గ్రామంలో ఎమ్మెల్యే ఆరి మిల్లి రాధాకృష్ణ ఆధ్వర్యంలో మంత్రులు శనివారం సాయంత్రం పరి శీలించారు. దువ్వ వయ్యేరు కాలువపై ఉన్న పాత వంతెన పరిశీలించారు. నీట మునిగిన వరిపొలాలను పరిశీలించారు. అనంతరం అత్తిలి మండలం వరిఘేడు, తిరుపతిపురం గ్రామాల్లో పంట పొలాలను పరిశీలించారు.

ఎస్. ఇల్లిందలపర్రులో..

పెనుమంట్ర : ఇది ప్రకృతి వైపరీత్యం కాదు..గత వైసీపీ ప్రభుత్వ వైఫల్యమే.. కాలువలను, డ్రెయినేజీలను ఐదేళ్లలో కనీసం పట్టించుకోక పోవడంతో తూడు, గుర్రపుడెక్కతో పూడుకుపోయి డ్రెయిన్లు లాగక పొలాలు ముంపు బారిన పడ్డాయని మంత్రి ఆరోపించారు. పెనుమంట్ర మండలం సోమరాజు ఇల్లిందలపర్రులో గోస్తనీ నది, జిఅండ్‌వీ కెనాల్ పోటెత్తడంతో ముంపునకు గురైన పంట పొలాలను పరిశీలించారు. అనంతరం రైతులతో ఇష్టా గోష్ఠి నిర్వహించారు. రైతులు కౌలు రైతులను ఆదుకోవాలని విత్తనాలు సరఫరా చేయాలని, భవిష్యత్తులో పొలాలు ముంపు బారిన వాటిల్లకుండా శాశ్వత పరిష్కారం చేయాలని పలువురు రైతులు మొరపెట్టుకున్నారు. మంత్రి అచ్చెన్నాయుడు మాట్లాడుతూ వచ్చే వేసవిలో జిఅండ్‌వీ కెనాల్, గోస్తనీ నది ఆధునీకరణ పనులు చేపడతామని హామీ ఇచ్చారు. గత వైసీపీ పాలకులు రైతుల ఖాతాలో ధాన్యం సొమ్ము జమ చేయలేదని 1600 కోట్ల రూపాయలు బకాయిలు పెడితే నాబార్డు నుంచి వెయ్యి కోట్లు అప్పు తెచ్చి రైతుల ఖాతాలో జమ చేశామన్నారు .మరో రూ.600 కోట్లు ఐదు ఆరు రోజుల్లో జమ చేస్తామని చెప్పారు.ఎమ్మెల్యేలు పితాని సత్యనారాయణ, ఆరుమిల్లి రాధాకృష్ణ ఉన్నారు.



ఇంతకు ముందెప్పుడూ ఇలా రాలేదు..

మంత్రుల ఎదుట ఆనందం వ్యక్తం చేసిన బాధితులు

కుక్కునూరు : వరద బాధితుల సమస్యలు తెలుసుకోవడానికి మంత్రులు కుక్కునూరులోని దాచారం పునరావాస కాలనీలో నిర్వాసితులతో బేటీ అయ్యారు. అధికారులు తమకు చేసిన సేవలను వారంతా మంత్రుల ఎదుట సంతోషంగా వ్యక్తం చేశారు. “వరద పెరుగుతుందని తెలిసిన వెంటనే కలెక్టర్ వెట్రిసెల్వి, మండల ప్రత్యేకాధిరులు, స్థానికాధికారులు మా గ్రామా నికి విచ్చేశారు. ఇళ్లు ఖాళీ చేసేందుకు ట్రాక్టర్లు ఏర్పాటు చేసి పునరావాస కేంద్రాలకు తీసుకొచ్చారు. విద్యుత్ సౌకర్యం, తాగునీరు ఏర్పాటు చేశారు. 3 రోజుల పాటు భోజనవసతి ఏర్పాటు చేశారు. రెండు రోజులుగా బియ్యం, కూరగాయలు, నిత్యావసర సరుకులు అందించటంతో మేమే వండు కుని తింటున్నాం. అధికారులు రోజు వస్తున్నారు...మీకేం కావాలని పదేపదే అడుగుతున్నారు. మాకు కష్టం లేకుండా చూస్తున్నారు..”అని కొమ్ము గూడెంకు చెందిన సముద్రాల రజిత చెప్పుకొచ్చారు. ఇంతకు ముందె ప్పుడూ ఇలా ఎవరూ రాలేదని బెస్త గూడెం గ్రామానికి చెందిన బొల్లు కృష్ణార్జునరావు తెలి పారు. నిజంగా అందుతున్నాయా లేక అలా చెప్పమం టున్నారా అని మంత్రి అచ్చెన్నాయుడు వ్యాఖ్యానించగా అలా ఏమీ లేదని అధికారులు బాగా చూస్తున్నారని బాధితులు తెలిపారు.

బాధితులకు రూ.3 వేలు నగదు,నిత్యావసర సరుకులు

దాచారం పునరావాస కాలనీలో ఉంటున్న 250 మంది గొమ్ముగూడెం నిర్వాసితులకు 25 కేజీల బియ్యం, 3 వేలు నగదు, కేజీ చొప్పున కందిపప్పు, ఉల్లిపాయలు, బంగాళదుంపలు, పామాయిల్ అందజేశారు. మూడు పునరావాస కేంద్రాల్లోని దాదాపు 1200 కుటుంబాలకు సహాయం అందించారు. దువ్వలో 1,198 వరద బాధిత కుటుంబాలకు 25 కేజీల బియ్యం, నిత్యావసర సరుకులు అందజేశారు.

గ్రామాల్లో ‘టీమ్ ఏలూరు’

విపత్కర పరిస్థితుల్లో సాయం చేసేందుకు ముందుకు రండి

కొత్త పద్ధతికి నాంది పలికిన కలెక్టర్ వెట్రిసెల్వి



కుక్కునూరు : దాచారం పునరావాస కాలనీలో శనివారం జిల్లా కలెక్టర్ వెట్రిసెల్వి వరదబాధితులతో మాట్లాడుతూ ఒక ఆసక్తికరమైన విషయాన్ని చెప్పారు. జిల్లావ్యాప్తంగా గ్రామాల్లో టీమ్ ఏలూరు ఏర్పాటు చేశామని గ్రామాల్లో విపత్కర పరిస్థితులు ఎదురైనప్పుడు వీరంతా సాయం చేయా లన్నారు.. వలంటీర్లుగా సేవలందించేందుకు ప్రతీ గ్రామం నుంచి ఎవరైనా ముందుకు రావచ్చన్నారు. వారికి ప్రత్యేకంగా టీమ్ ఏలూరు పేరుతో టీషర్టులు అందిస్తాం.. వారంతా గ్రామాల్లో ఎటువంటి విపత్కర పరిస్థితి ఎదురైన వెంటనే జిల్లా అధికారులకు సమాచారం అందించాలి. తద్వారా ఆ సమస్య పరిష్కారానికి అధికారులు వేగవంతగా చర్యలు చేపడతారు. ప్రస్తుతం ముంపుబాధిత గ్రామాల నుంచి ఎవరైనా వలంటీర్లుగా సేవలందించడానికి ముందుకు వస్తారా అని కలెక్టర్ అడిగారు. దీంతో దాదాపు 15 మంది యువతీ యువకులు తమ గ్రామాల్లో పని చేయడానికి సిద్ధమైనట్లు కలెక్టర్ తెలిపారు. కలెక్టర్ నవ్వుతూ మీ సేవకు జీతాలు మాత్రం ఉండవన్నారు. కొమ్ముగూడెం గ్రామం ముంపునకు గురవుతున్న సమయంలో ఆ గ్రామానికి చెందిన పలువురు యువకులు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి గ్రామస్థులను పునరావాస కేంద్రాలకు తరలించడానికి సహకరించారు. కలెక్టర్ వారికి అభినందనలు తెలిపారు.

కొరియర్ కంపెనీ నుంచి అంటూ కాల్..



ఆన్‌లైన్ మోసానికి భీమవరం వ్యక్తి బలి

దఫదఫాలుగా రూ.7 లక్షలు కాజేశారు

సైబర్ క్రైం పోలీసులకు ఫిర్యాదు చేసిన బాధితుడు

భీమవరం క్రైం, జూలై 27 : “కొరియర్ కంపెనీ నుంచి ఫోన్ చేస్తున్నాం.. మీకు ఒక కొరియర్ వచ్చింది. దానిలో కొన్ని అనుమానపు వస్తువులు ఉన్నాయి.” అంటూ బెదిరించి సుమారు ఏడు లక్షలు కాజేశారు.. ఆన్‌లైన్ దుండగలు. భీమవరం టూటౌన్ సీఐ శ్రీనివాస్ తెలిపిన వివరాలు ప్రకారం భీమవరం 39వ వార్డు దుర్గాపురానికి చెందిన సింగవరపు గణేష్‌కు కొద్ది రోజుల క్రితం ఒక ఫోన్‌కాల్ వచ్చింది. తాము ముంబై పెడెక్స్ కొరియర్ నుంచి ఫోన్ చేస్తున్నామని చెప్పారు. నీకు ఒక పార్సిల్ వచ్చింది. అందులో అనుమానిత ఆరు పాస్‌పోర్టులు, రెండు పెన్‌డ్రైవ్‌లు ఉన్నాయని ఆ విషయం ముంబై పోలీసులకు తెలిసిపోయిందని ఫోన్ చేశారు. అనంతరం మరో నెంబర్ నుంచి గణేష్‌కు ఫోన్ వచ్చింది.నీకు వచ్చిన పార్సిల్ అనుమానాస్పదంగా ఉందని అలాగే నీపేరున ఉన్న కొన్ని బ్యాంక్ అకౌంట్‌లుపై అనుమానం ఉందని ఆ అకౌంట్‌లకు డబ్బులు జమ చేయాలని తెలపడంతో గణేష్ తన వద్ద డబ్బులు లేవని చెప్పాడు. దీంతో అవతలివారు మేము చెప్పిన విధంగా చెయ్యమని ఫేక్ అకౌంట్ ద్వారా గణేష్ పేరుమీద ఐసీఐసీఐ బ్యాంక్‌లో 16 లక్షల పదకొండువేల ఏడువందల నలభై ఒక్క రూపాయలకు లోన్ తీసుకునేలా చేశారు. అనంతరం ఆ సొమ్మును తాము చెప్పిన అకౌంట్లుకు ట్రాన్స్‌ఫర్ చెయ్యాలని గణేష్‌ను ఆదేశించారు. అది నమ్మిన గణేష్ నాలుగు అకౌంట్లుకు సుమారు రూ.7 లక్షలు వరకు ట్రాన్స్‌ఫర్ చేశాడు. తరువాత అనుమానం వచ్చిన గణేష్ సైబర్‌క్రైం టోల్‌ఫ్రీ నెంబర్ 1930 ఫిర్యాదు చెయ్యడంతో అసలు విషయం బయటకు వచ్చింది. వెంటనే స్పందించిన సైబర్ క్రైం పోలీసులు లోకల్ పోలీసులు ఆధ్వర్యంలో ఆ అకౌంట్లలో ఉన్న సుమారు 5 లక్షలు రూపాయలను ఫ్రీజ్ చేశారు. దీనిపై దర్యాప్తు చేస్తున్నామని సీఐ శ్రీనివాస్ తెలిపారు. ఎవరూ కూడా నకిలీ ఫోన్‌కాల్స్‌కు స్పందించవద్దని ఏదైనా అనుమానం వస్తే సంబంధిత పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చెయ్యాలని సీఐ కోరారు.

ఏపీకే లింకుల పట్ల అప్రమత్తంగా ఉండండి

ఏలూరు క్రైం, జూలై 27 : మొబైల్ ఫోన్‌లోని వాట్సప్‌లలో ఏపీకె లింకు ఫైల్స్‌ను కొంతమంది తెలియక ఫార్వాడ్ చేస్తున్నారని ఇలాంటి వాటిని ఎవరైనా క్లిక్ చేస్తే వెంటనే ఆ మొబైల్ హ్యాక్ అయి అకౌంట్‌లో ఉన్న నగదు మొత్తం పోతుందని జిల్లా సైబర్ సెల్ అధికారులు సూచిస్తున్నారు. ఇలాంటి లింకుల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. ఎట్టి పరిస్థితుల్లో ఎవరైనా ఏపీకే ఫైల్స్‌ను పంపిస్తే క్లిక్ చేయవద్దని వెంటనే డిలీట్ చేయాలని సూచించారు.

క్రైం కార్నర్



బాదంపూడి వై జంక్షన్ వద్ద రోడ్డు ప్రమాద దృశ్యం

కారు..ట్రావెల్ బస్సు ఢీ..నలుగురికి గాయాలు

ఉంగుటూరు, జూలై 27 : ఉంగుటూరు మండలం బాదంపూడి వై జంక్షన్ వద్ద శనివారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో కారులో ప్రయాణిస్తున్న నలుగురు ప్రయాణికులు గాయపడ్డారు. హైదరాబాదు నుంచి యానాం వెళుతున్న ప్రైవేటు ట్రావెల్స్ బస్సు తాడేపల్లిగూడెం వైపు మలుపు తిప్పుతున్న సమయంలో వాడపల్లి నుంచి విజయవాడ వెళుతున్న కారు ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో కారులో ప్రయాణిస్తున్న డ్రైవర్ కే.తేజ, ఐ.శ్రీనివాస్, పందేశ్, దావానీలు గాయపడ్డారు. గాయపడిన వారిని తాడేపల్లిగూడెం ఏరియా ఆసుపత్రికి తరలించారు

పట్టపగలే మోటారు చోరీ

ఏలూరు క్రైం, జూలై 27 : నిర్మాణంలో ఉన్న ఇంటి వద్ద ఏర్పాటు చేసిన మోటారును ఓ దొంగ పట్టపగలే అపహరించుకుపోయాడు. బాధితుడు దీనిపై ఏలూరు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఏలూరు రూరల్ పరిధిలో ఆండాళ్ళమ్మ తోటలో ఓ ఇంటి నిర్మాణం జరుగుతుండగా ప్రాంగణంలో మోటార్లను ఏర్పాటు చేశారు. ఈనెల 26వ తేదీ సాయంత్రం పట్టపగలే ద్విచక్ర వాహనంపై వచ్చిన ఓ దొంగ ఆ మోటారును అపహరించుకుపోయాడు.మోటారును దొంగిలించడం, ద్విచక్ర వాహనంపై రావడం ఇవన్నీ అక్కడ సమీపంలోని సీసీ కెమెరాల్లో రికార్డు అయ్యాయి. ఇంటి యజమాని కె.శ్రీనివాస్ సీసీ పుటేజ్‌లను ఏలూరు రూరల్ పోలీసులకు అప్పగించి ఈ చోరీపై ఫిర్యాదు చేశారు.

రైలు కిందపడి వృద్ధుడి ఆత్మహత్య

ఏలూరు క్రైం, జూలై 27 :ఏలూరు సమీపంలోని వట్లూరు ఫ్లైఓవర్ బ్రిడ్జి కింద ఒక గుర్తు తెలియని వృద్ధుడు శనివారం రాత్రి ఆత్మహత్యకు పాల్పడినట్టు ఏలూరు రైల్వే ఎస్ఐ సైమన్‌కు సమాచారం అందింది. దీంతో తన సిబ్బందితో సంఘటనా స్థలానికి వెళ్ళి పరిశీలించారు. మృతుడు సుమారు 70 ఏళ్ళ వయస్సు కల్గి, 5.5 అడుగుల ఎత్తు, తెల్లని జుత్తు, తెల్లని గడ్డం కల్గి ఉన్నాడు. ఎరుపు రంగు పొట్టి చేతుల షర్టు, కాషాయరంగు లుంగీ, కాషాయరంగు టవల్ ధరించి ఉన్నాడు. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి మృత దేహాన్ని ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మృతుని వివరాలు తెలిసిన వారు ఏలూరు రైల్వే ఎస్ఐ సెల్ నెంబర్ 99892 19559కు సమాచారం అందించాలని రైల్వే పోలీసులు కోరారు.

కట్నం కేసు నమోదు

భీమవరం క్రైం, జూలై 27 : తన భర్త అదనపు కట్నం కోసం వేధిస్తున్నాడంటూ భీమవరం మండలం రాయలం గ్రామానికి చెందిన పట్టపు లక్ష్మీప్రసన్న టూటౌన్ పోలీసులకు శనివారం ఫిర్యాదు చేశారు. లక్ష్మీప్రసన్నకు రాయలం గ్రామానికి చెందిన గంగాప్రసాద్‌తో కొంత కాలం క్రితం వివాహం అయ్యింది. వీరికి ఇద్దరు సంతానం.. కొంతకాలంగా కట్నం తీసుకుమ్మని వేధించడమే కాకుండా శుక్రవారం రాత్రి పూటుగా మద్యం సేవించి వచ్చి ఇబ్బందులకు గురి చెయ్యడంతో ఆమె ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ ప్రసాద్ తెలిపారు.



బస్ క్యాబిన్‌లో ఇరుక్కుపోయిన డ్రైవర్‌ను బయటకు తీస్తున్న దృశ్యం

ఆగి వున్న లారీని ఢీకొన్న ట్రావెల్ బస్సు

వృద్ధురాలి మృతి.. పలువురికి గాయాలు

పెదపాడు, జూలై 27 :విజయవాడ కనకదుర్గమ్మను దర్శించుకుని అమ్మవారికి పసుపు-కుంకుమ సమర్పించేందుకు వారంతా యాత్రగా బస్‌లో బయలుదేరారు. ఏలూరు జిల్లా పెదపాడు మండలం కలపర్రు టోల్‌గేట్ సమీపంలో జాతీయ రహదారిపై శనివారం ఉదయం వారు ప్రయాణిస్తున్న ట్రావెల్ బస్సు ఆగి ఉన్న లారీని ఢీకొట్టడంతో ఒకరు మృతి చెందగా పలువురికి గాయాలయ్యాయి. మన్యం జిల్లా పార్వతీపురానికి చెందిన 29 మంది ఆషాడమాసంలో అమ్మవారిని దర్శించుకునేందుకు అంతా కలిసి ప్రైవేట్ ట్రావెల్స్ బస్సులో శుక్రవారం సాయంత్రం బయలుదేరారు. తెల్లవారు జాము 5.30 గంటల ప్రాంతంలో కలపర్రు వద్ద జాతీయ రహదారిపై హోటల్ ముందు ఆగి ఉన్న లారీని బస్ అతివేగంగా ఢీకొట్టింది. ప్రమాదంలో పెద్దూరు గ్రామం, గురుపల్లి మండలం, పార్వతీపురం మన్యం జిల్లాకు చెందిన ముగడ కృష్ణమ్మ (60) అక్కడికక్కడే మృతి చెందగా బస్ డ్రైవర్ కిలారి లక్ష్మణరావుకు కాలిలో ఇనుపచువ్వ బలంగా దిగబడింది. బస్ క్యాబిన్‌లో ఇరుక్కుపోయిన డ్రైవర్‌ను బయటకు తీసేందుకు పోలీసులతో పాటు పలువురు తీవ్రంగా శ్రమించారు.గాయాలపాలైన వారిని చికిత్స నిమిత్తం ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మృతిరాలి బంధువు హరిబాబు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్సై కె.శుభశేఖర్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.కలెక్టర్ ఆదేశాలతో ఏలూరు ఆర్డీవో ఖాజావలి, పెదపాడు ఎమ్మార్వో భావనారాయణ, ఏలూరు ఎమ్మార్వో మురార్జీ ఏలూరు ప్రభుత్వాసుపత్రికి చేరుకున్నారు. బాధితుల నుంచి వివరాలు అడిగి తెలుసుకున్నారు. 16 మంది స్వల్ప గాయాలవగా వారందరికీ ప్రాథమిక చికిత్స చేయించి వారందరిని స్వస్థలానికి వెళ్ళేలా వాహనాన్ని ఏర్పాటు చేసినట్టు చెప్పారు.

బాలికపై అత్యాచారం..

ఆకివీడు, జూలై 27 : తన కుమార్తెను యువకులు అత్యాచారం చేశారని శుక్రవారం బాలిక తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేర పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఉండి గ్రామానికి చెందిన మైనర్ బాలికను ఆకివీడు మండలానికి చెందిన వివాహమైన వ్యక్తి మోటారు సైకిల్‌పై తీసుకెళ్లి వివాహం అయిన మరో వ్యక్తితో కలిసి దుంపగడప శివారు ఉప్పుటేరు దగ్గర అత్యాచారం చేశారని తండ్రి ఫిర్యాదు చేశాడు. డీఎస్పీ పర్యవేక్షణలో శనివారం ఎస్ఐ బత్తిన నాగబాబు కేసు నమోదు చేశారు.

అసభ్యంగా ప్రవరిస్తున్నాడని చాకుతో పొడిచిన యువతి

తీవ్రగాయాలు..ఏలూరు ఆసుపత్రికి తరలింపు





దాడిచేసిన యువతి.. గాయపడిన వ్యక్తిని అంబులెన్స్‌లో ఆసుపత్రికి తరలిస్తున్న సిబ్బంది

ద్వారకా తిరుమల, జూలై 27: మానసిక స్థితి సక్రమంగా లేని ఓ యువతి తన పట్ల అసభ్యకరంగా ప్రవర్తించిన వ్యక్తిపై చాకుతో దాడి చేసింది. ద్వారకాతిరుమల ఆలయ పాత కల్యాణ మండపంలో నిద్రిస్తున్న ఆ వ్యక్తి చేతిపైన, ముఖంపైన పొడవడంతో అతను తీవ్రంగా గాయపడ్డాడు. అతనిని హుటాహుటిన దేవస్థానం సెక్యూరిటీ సిబ్బంది స్థానిక పీహెచ్‌సీకి తరలించి ప్రథమ చికిత్స చేసిన వైద్యులు ఏలూరు ప్రభుత్వ ఆసుపత్రికి పంపించారు. ద్వారకా తిరుమలకు చెందిన తిరునగిరి రమేష్ మద్యం సేవించి దుబారాగా తిరుగుతుంటాడు. ఈ క్రమంలో ఈమెతో కొద్దిరోజులుగా అసభ్యకరంగా ప్రవర్తిస్తున్నాడు. దీంతో ఆ యువతి అతను మండపంలో నిద్రిస్తున్న సమయంలో చాకుతో దాడికి తెగబడింది. అతని చేతిపైన, ముఖంపైనా దాడి చేయడంతో తీవ్ర రక్తస్రావమైంది. ఏలూరు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న అతని పరిస్థితి విషమంగానే ఉన్నట్లు తెలిసింది. ఆ యువతి నెలరోజులుగా ఇక్కడిక్కడే తిరుగుతోందని స్థానికులు చెబుతున్నారు.



డీడీవోలుగా పదోన్నతి పొందిన కార్యదర్శులను అభినందిస్తున్న తాడేపల్లిగూడెం ఎంపీడీవో శర్మ

సచివాలయ కార్యదర్శుల్లో ఆనందం..

325 మంది కార్యదర్శులకు డీడీవో హోదా

తాడేపల్లిగూడెం రూరల్, జూలై 27: సచివాలయ కార్యదర్శులకు కూటమి ప్రభుత్వం తీపి కబురు చెప్పింది. గత వైసీపీ సర్కారు సచివాలయ అధికారులుగా నియమించి త్రిశంకు స్వర్గంలో వదిలేసిన వారికి డీడీవో (డ్రాయింగ్, డిజ్బర్స్ ఆఫీసర్)లుగా పదోన్నతి కల్పించింది. గతంలో సచివాలయాల్లో పేరుకే కార్యదర్శులుగా మిగిలిన గ్రేడ్-5 సచివాలయ కార్యదర్శులకు పూర్తి బాధ్యతలు కల్పిస్తూ తీసుకున్న నిర్ణయం అన్ని వర్గాల్లో హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి. దీంతో ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలో 325 మంది సచివాలయ కార్యదర్శులకు డీడీవో హోదా లభించినట్లయింది. ఫలితంగా గ్రామ పంచాయతీల్లో చేసే ఖర్చులు, ఉద్యోగుల జీతాలు అందించడానికి కార్యదర్శులకు పూర్తి స్వేచ్ఛ ఇచ్చినట్టయింది. వైసీపీ ప్రభుత్వం మొదటి నుంచి సచివాలయ ఉద్యోగులపై వివక్షత చూపుతూనే వచ్చింది. తాము ఏదో కొత్త వ్యవస్థను తీసుకొచ్చామని డప్పు కొట్టుకోవడం తప్ప వ్యవస్థ అంతా అస్తవ్యస్తంగా మారింది. సచివాలయ కార్యదర్శులు కేవలం గుమస్తాలుగానే పనిచేయాల్సి వచ్చింది. గ్రామంలో కచ్చా డ్రెయిన్ పూడిక తీయాలన్నా ఆ సచివాలయానికి సమీపంలో ఉండే గ్రేడ్-1 ఈవోల వద్దకు పరుగులు పెట్టాల్సిన పరిస్థితి. సచివాలయ కార్యదర్శులకు స్వతంత్ర ప్రతిపత్తి లేకుండా పోయింది. ఎన్నికల ముందు డీడీవోగా పదోన్నతి ఇస్తున్నట్టు వైసీపీ ప్రభుత్వం మొక్కుబడిగా జీవో ఇచ్చింది. ఇచ్చిన మూడు రోజుల్లోనే ఎన్నికల కోడ్ రావడంతో ఆ జీవో నీరుగారిపోయింది.



మాట్లాడుతున్న న్యాయాధికారి రత్న ప్రసాద్

మారుతున్న చట్టాలపై అవగాహన పెంచుకోవాలి

ఏలూరు క్రైం, జూలై 27: మారుతున్న చట్టాలపై ఎప్పటికప్పుడు సంబంధిత అధికారులకు అవగాహన కల్పించడమే జిల్లా న్యాయ సేవాధికార సంస్థ లక్ష్యమని ఆ సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి కె.రత్నప్రసాద్ అన్నారు. ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలో ప్రత్యేక జువైనల్ పోలీసులకు ఒకరోజు శిక్షణ, అవగాహన కార్యక్రమాన్ని శనివారం ఏలూరు జిల్లా కోర్టు ఆవరణలోని లోక్ అదాలత్ భవనంలో నిర్వహించారు. రత్నప్రసాద్ మాట్లాడుతూ బాలలను ఏ విధంగా కౌన్సెలింగ్ నిర్వహించి వారికి అందించాల్సిన సౌకర్యాలపైన అవగాహన కల్గించుకోవాలని సూచించారు. అదనపు జూనియర్ సివిల్ జడ్జి బులికృష్ణ మాట్లాడుతూ రాజ్యాంగం బాలలకు కొన్ని హక్కులు కల్పించిందని వాటిని కాపాడడమే న్యాయస్థానాల ముఖ్య ఉద్దేశమన్నారు.వాటిని ఖచ్చితంగా అమలు పరిచే పోలీసులకు, ఇతర అధికారులకు వీటిపై పూర్తి అవగాహన కల్గించాలన్నారు. జిల్లా అదనపు ఎస్పీ స్వరూపరాణి మాట్లాడుతూ న్యాయస్థానాలు ఎప్పటికప్పుడు అందిస్తున్న అవగాహన సదస్సులకు హాజరు కావడమే కాకుండా వాటిని నిబద్ధతతో అమలు పరిచి సమాజ సేవలో అధికారులు భాగస్వామ్యం కావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డీసీపీవో సూర్య చక్రవేణి, ప్రొబిషనర్ ఆఫీసర్ డి.దుర్గాప్రసాద్, ఏలూరు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు అబ్బినేని విజయ్‌కుమార్, ప్యానల్ న్యాయవాదులు తిగిరిపల్లి సుబ్బారావు, కె.వెంకటేశ్వరరావు, కృష్ణారావు, న్యాయవాదులు, పోలీసు అధికారులు, సీడబ్ల్యూసీ సిబ్బంది, ఇతర అధికారులు, పారా లీగల్ వలంటీర్లు పాల్గొన్నారు.

వైభవంగా జగన్నాథ స్వామి రథయాత్ర


రథయాత్రలో పాల్గొన్న భక్తులు

ఏలూరు కార్పొరేషన్, జూలై 27 : స్థానిక అశోక్‌నగర్‌లోని జగన్నాథ స్వామి సేవా ట్రస్టు ఆధ్వర్యంలో బలదేవ, సుభద్ర సమేత జగన్నాథస్వామి కొలువైన రథయాత్ర శనివారం నగర వీధుల గుండా సాగింది. రథయాత్ర వెంబడి భక్తులు సాగుతూ భక్తి పారవశ్యంలో మునిగిపోయారు. స్వామి, అమ్మవార్లకు హారతులిచ్చి, సంకీర్తనలు ఆలపించి భజనలు చేస్తూ భక్తి శ్రద్ధలతో భక్తులు రథం వెంట పయనించారు. జగన్నాథుని రథయాత్రతో నగరంలో సందడి నెలకొంది.

కందిపప్పు, బియ్యం విక్రయాలు

టి.నరసాపురం, జూలై 27: ప్రభుత్వం నిర్ణయించిన ధరలకే కందిపప్పు, బియ్యం విక్రయించాలని డిప్యూటీ తహసీల్దార్ ఉదయ్ తెలిపారు. జిల్లా పౌర సరఫరాల అధికారి ఆదేశాల మేరకు టి.నరసాపురం తహసీల్దార్ టి.సుభాష్ ఆధ్వర్యంలో టి.నరసాపురంలో నూతనంగా ఏర్పాటు చేసిన కందిపప్పు, బియ్యం విక్రయ కేంద్రాన్ని శనివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో టి.నరసాపురం, మక్కినవారిగూడెం, బొర్రంపాలెం గ్రామాల్లో ఈ విక్రయించే కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు. వీఆర్వో గోపి తదితరులు పాల్గొన్నారు.

ఏలూరి ఫణికుమార్‌కు గౌరవ డాక్టరేట్


గౌరవ డాక్టరేట్ అందుకుంటున్న ఫణికుమార్

జంగారెడ్డిగూడెం, జూలై 27 : పట్టణానికి చెందిన చాంబర్ ఆఫ్ కామర్స్ జిల్లా అధ్యక్షుడు ఏలూరి ఫణికుమార్ వ్యాపార సేవా రంగంలో చేసిన పలు సేవలను గుర్తించి ఆసియా ఇంటర్నేషనల్ కల్చర్ రీసెర్చ్ యూనివర్శిటీ తరపున యూనివర్శిటీ ప్రతినిధులు శనివారం బెంగుళూరులో గౌరవ డాక్టరేట్ ప్రదానం చేశారు. ఫణికుమార్‌ను ఏపీ ఆర్య వైశ్య మహాసభ అధ్యక్షుడు చిన్ని రామసత్యనారాయణ, వాసవీ క్లబ్ సభ్యుడు కె.ఆనంద్, పి.కాశీ, ఆర్యవైశ్య సంఘ నాయకులు అభినందించారు.

వెంకటేశ్వరరావు మృతికి పలువురి సంతాపం

టి.నరసాపురం, జూలై 27: ఏలూరు జిల్లా చాట్రాయి మండలం చనుబండ గ్రామానికి చెందిన ప్రముఖ బుర్రకథ కళాకారుడు పొదడపాల వెంకటేశ్వర రావు మృతికి ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా ప్రజా నాట్యమండలి గౌరవ అధ్యక్షుడు, సీనియర్ బుర్రకథ కళాకారుడు సబ్బి కనకారావు, ఏలూరు జిల్లా ప్రజా నాట్య మండలి కన్వీనర్ టీవీఎస్ రాజు, ప్రముఖ బుర్రకథ కళాకారుడు వీరమల్ల సత్యనారాయణ శనివారం ఒక ప్రకటనలో తమ ప్రగాఢ సంతాపం తెలిపారు. యువ కళాకారులను చైతన్యవంతులుగా తీర్చిదిద్దిన వెంకటేశ్వర రావు మృతికి ఏపీ రాష్ట్ర జానపద కళాకారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎల్ఆర్ కృష్ణబాబు, ప్రజా నాట్య మండలి బుర్రకథ కళాకారుడు ఎం.ప్రేమానందం, మహిళా బుర్రకథ కళాకారిణి విభూది రాజేశ్వరి, బచ్చు నందకుమార్ తదితర బుర్రకథ కళాకారులు వెంకటేశ్వర మృతికి సంతాపం తెలుపుతూ ఆయన కుటుంబానికి తమ ప్రగాఢ సానుభూతి తెలిపారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

ఏలూరు టూ టౌన్, జూలై 27: సీజనల్ వ్యాధులు అరికట్టేందుకు మలేరియా విభాగంతో కలిసి తగు చర్యలు తీసుకుంటున్నట్లు మున్సిపల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ రెడ్డి మాలతి అన్నారు. స్టాప్ డయేరియా కార్యక్రమంలో భాగంగా 44వ డివిజన్‌లో రెల్లీస్‌పేట, ముస్లీంకాలనీ, గన్‌బజార్, ప్రాంతాల్లో పారిశుధ్య కార్మికులు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆయా ప్రాంతాల్లో దోమల నిర్మూలనకు లార్వా ఫాగింగ్, ఆయిల్ బాల్స్ వేయడం వంటి కార్యక్రమాలు చేపట్టారు. మలేరియా, శానిటరీ ఇనస్పెక్టర్లు వేణుగోపాల్‌స్వామి, చంద్రశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

జాతీయ స్థాయి ఈత పోటీలకు స్వామినాయుడు

ఏలూరు రూరల్, జూలై 27: జాతీయ స్థాయి ఈత పోటీలకు ఏలూరు శ్రీసూర్య ఇంగ్లీష్ మీడియం స్కూల్ విద్యార్థి బి.స్వామినాయుడు ఎంపిక య్యారు. ఇటీవల కడపలో జరిగిన రాష్ట్రస్థాయి స్విమ్మింగ్ పోటీల్లో నాలుగు బంగారు పతకాలు సాధించి విశేష ప్రతిభ కనబరిచాడు.

మోదీతోనే దేశానికి రక్షణ

దెందులూరు 27 :ప్రధాన మంత్రి మోదీతోనే దేశానికి రక్షణ సాధ్యమవుతుందని నియోజకవర్గ బీజేపీ అసెంబ్లీ కన్వీనర్ గుమ్మడి వెంకటచైతన్య కృష్ణ అన్నారు. మండల పార్టీ అధ్యక్షుడు మందూరి బుజ్జీ గోపాల్, నియోజకవర్గ పార్టీ ఆధ్వర్యంలో శనివారం కార్గిల్ దివాస్ కార్యక్రమం నిర్వహించారు. ఎన్టీఆర్ పార్టీ నేతలు గుజ్జుల బాబురావు, తోట ఆంజనేయులు, వేమన గణపతి, శివకొండ, ప్రభు చౌదరి తదితరులు పాల్గొన్నారు.

పెద్ద చెరువు కాలువ పూడికతీత



చింతలపూడి, జూలై 27: ఇటీవల కురిసిన భారీ వర్షాలకు చింతలపూడి పెద్దచెరువు అలుగు నీరు పోయే దారిలేక పొలాలు ముంపునకు గురయ్యాయి. ఆయకట్టు రైతులు విజ్ఞప్తితో ఎమ్మెల్యే సొంగా రోషన్‌కుమార్ చెరువు కాలు వల పూడిక తొలగింపునకు జేసీబీని పురమాయించడంతో రెండు రోజులుగా కాలువ పూడిక పనులు జరుగుతున్నాయి. ఈ చెరువు ఆయకట్టులో సుమారు వెయ్యి ఎకరాలకు పైగా వరి సాగు చేస్తుంటారు. ఇప్పటివరకు ఈ ముంపు వల్ల వరినాట్లు కూడా ఆలస్యమయ్యాయి. పూడిక మట్టి తిరిగి కాలువలో జారి పోకుండా తొలగించే చర్యలు తీసుకోవాలని రైతులు అంజిబాబు, పట్టాభి, రాజారత్నం, పలువురు కోరారు.

సంక్షిప్త సమాచారం..

- **ద్వారకాతిరుమల :** తెల్లవారు జాము నుంచి వర్షం కురుస్తున్నప్పటీ చినవెంకన్న ఆలయాని శనివారం భక్తులు పెద్దసంఖ్యలో విచ్చేశారు. సుమారు 12 వేల మంది పైబడి భక్తులు స్వామివారి దర్శనం చేసుకున్నట్టు ఆలయ వర్గాల సమాచారం
- **జంగారెడ్డిగూడెం :** ముంపు ప్రాంతాల నుంచి జంగారెడ్డిగూడెం ఏరియా ఆస్పత్రికి వైద్యం నిమిత్తం వచ్చిన గర్భిణులు, బాలింతలు 32 మందికి రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో ప్రతిరోజు రాత్రి భోజన సదుపాయం కల్పిస్తున్నట్లు రోటరీ క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు ఊడా రామ్‌గోపాల్ (గోపీ), బవిరిశెట్టి హనుమాన్ తిలక్ తెలిపారు.
- **టి.నరసాపురం :** వేలేరుపాడు మండలంలోని పెదవాగు ప్రవాహానికి నిరాశ్రయులైన బాధితులకు టి.నరసాపురం మండలం రాజుపోతేపల్లి గ్రామానికి చెందిన జూస్తి స్వచ్ఛంద సేవా సంస్థ వ్యవస్థాపకులు జాస్తి సుబ్బారావు, జేబీ దంపతులు దుప్పట్లు కూరగాయలు శనివారం పంపిణీ చేశారు.
- **చింతలపూడి :** మిషన్ మహాశక్తి కార్యక్రమంలో భాగంగా స్థానిక సుబ్బరాజు హైస్కూల్ ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులకు శనివారం చట్టాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ప్రిన్సిపాల్ శ్రీనివాస్, సూపర్‌వైజర్లు, ఏఎన్ఎంలు పాల్గొన్నారు.
- ఏపీ ఎన్జీవో సంఘం ఆధ్వర్యంలో అలిపెల్లి యూపీ స్కూల్లో మంగళవారం ఉచిత హోమియో వైద్య శిబిరం నిర్వహించారు. ఎన్జీవో నాయకులు ఎస్‌కే అబ్రార్ హుస్సేన్, ఇందిరా ప్రియదర్శిని, పొనగాల మల్లయ్య, ఫాదర్ మరియజోజి, హెచ్‌ఎమ్ బాబురావు పాల్గొన్నారు.
- కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో బీహార్‌కు గ్రాంటులు, ఆంధ్రాకు అప్పులు కేటాయించినట్లు ఉందని, సీపీఐ మండల కార్యదర్శి కంచర్ల గురవయ్య విమర్శించారు. బడ్జెట్ మధ్య పేద తరగతులకు భారం పెంచిందన్నారు. జంగా రామచంద్రారెడ్డి, బాబు, సోమశేఖర్ పాల్గొన్నారు.
- **కుక్కునూరు :** బెస్తగూడెం పాఠశాలను డీఈఓ అబ్రహం శనివారం సందర్శించి విద్యా బోధనను పరిశీలించారు. వర్షాకాలం, వరదల కారణంగా పాఠశాలను, పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని మధ్యాహ్న భోజనం మెనూ ప్రకారం అందించాలని హెచ్ఎం రాధాకు సూచించారు. ఎంఈఓ గిరిభగవాన్‌దాస్ పాల్గొన్నారు.

పచ్చదనం మాటున ప్రమాదం

- డివైడర్‌ల మధ్య ప్రమాదకర ఫోనోకార్పస్ చెట్లు
- వీటితో ప్రమాదమని హెచ్చరికలు


ఏలూరులో డివైడర్‌కి మధ్యన ఉన్న ఫోనో కార్పస్ మొక్కలు

ఏలూరు రూరల్, జూలై 27: పచ్చదనానికి పెద్దపీట వేద్దాం, ప్రతి ఒక్కరూ ఒక మొక్క నాటండి, దానిని సంరక్షించండి పర్యావరణాన్ని పరిరక్షించండి ఇవి పాలకులు, అధికారులు నిరంతరం చెప్పే మాటలు. అందులో భాగంగా ఏలూరు, రూరల్ ప్రాంతాల్లో డివైడర్‌ల మధ్య, ఆర్‌అండ్‌బీ రహదారులు ఇరువైపులా అందంగా కనిపించేందుకు ఫోనో కార్పస్ (దుబాయ్) మొక్కలు వేశారు, వేస్తున్నారు. అయితే వీటితో ప్రమాదం అని ఇటీవల అధ్యయనాల్లో వెల్లడైంది. ఈ క్రమంలో రాష్ట్రంలో ఈ మొక్కలు నర్సరీల్లో పెంచవచ్చని, ఎక్కడా వాటిని వేయవద్దని ఫోనో కార్పస్ మొక్కల పెంపకం పై ఏర్పడే అనర్థాలను వివరిస్తూ ఇతర రాష్ట్రాలు నిర్ణయాలు తీసుకున్నాయి. రాష్ట్రంలో కూడా ఫోనో కార్పస్ మొక్కలను తొలగిస్తున్నారు. అయితే ఏలూరు, రూరల్ గ్రామాల్లో ఈ మొక్కలు డివైడర్‌ల మధ్య దర్శనమిస్తున్నాయి. పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత, అందులో ఎటువంటి సందేహం లేదు. పచ్చదనం పేరుతో ప్రమాదాన్ని కొని తెచ్చుకోవడం సరికాదు. దుబాయ్, పాకిస్తాన్, ఆఫ్రికా దేశాల్లో విరివిగా పెంచే ఈ మొక్కలు పలు దేశాలు నిషేధించాయి. ఈ మొక్కలు క్రమేణా పెరిగి భూమిలోకి అత్యంత దూరం వేళ్ళుపాకుతూ నీటి వనరులను హరించి వేస్తాయి. వర్షాభావ పరిస్థితులకు కారణమవుతాయి. ఈ క్రమంలో పలు కథనాలు వెలువడిన నేపథ్యంలో ఇటు ఆంధ్రప్రదేశ్‌లో చర్చ మొదలైంది. ఈ మొక్కలను తెలంగాణ రాష్ట్రం పెంచడం లేదు. శ్వాసకోస వ్యాధులకు కారకాలుగా మారతాయనే ఉత్తర్వులు ఉన్నాయి. వేగంగా పెరిగే ఈ చెట్టు అందంగా ఉన్న పర్యావరణానికి పెనుప్రమాదంగా మారతుంది. ఈ మొక్కను రహదారులు, కమ్యూనిటీ అవెన్యూ, ప్లానిటేషన్‌లో పెంచుతున్నారు. అయితే ఫోనో కార్పస్ మొక్క పర్యావరణానికి హాని చేయడంతో పాటు ప్రజారోగ్య సమస్యలకు కారణమవుతుంది. గాలిలో ఎక్కువ సంఖ్యలో పుప్పొడి రేణువులు కనిపించటం అది ఖోఖో కార్పస్ పుష్పాలివిగా తెలియడంతో ఇవి పర్యావరణ చేటు అని పర్యావరణ వేత్తలు పేర్కొంటున్నారు. ఈ చెట్టు పెంచితే ప్రాణాలకే ముప్పు అని తెలుపుతు న్నారు. ఈ చెట్ల పై కనీసం పిట్టవాలదు కదా మేకలు, గొర్రెలు కూడా వీటి ఆహారంగా తినవు. తక్షణం ఈ మొక్కలను తొలగించాలని స్థానికులు కోరుతున్నారు.

పోలీస్ స్టేషన్ చుట్టూ షాపింగ్ కాంప్లెక్స్ : మంత్రి అనిత


పోలీస్‌స్టేషన్ ఆవరణను పరిశీలిస్తున్న హోం మంత్రి అనిత

కొయ్యలగూడెం, జూలై 27: కుక్కునూరు, వేలేరుపాడు వరద ప్రాంతాలను పరిశీలించి తిరిగి వస్తూ శనివారం సాయంత్రం కొయ్యలగూడెం ప్రధాన సెంటర్‌కు చేరుకున్న మంత్రులు అచ్చెంనాయుడు, రామానాయుడు, హోం మంత్రి అనితకు కూటమి నాయకులు ఘన స్వాగతం పలికారు. మంత్రి అనిత ప్రధాన సెంటర్‌లో ఉన్న పోలీస్ స్టేషన్ ఆవరణను పరిశీలించారు. ఈ పోలీస్ స్టేషన్ చుట్టూ షాపింగ్ కాంప్లెక్స్ నిర్మించాలని స్థానిక నాయకులు ఆమెకు వివరించారు. దాంతో మంత్రి పరిశీలిస్తామని హామీ ఇచ్చారు. అదే విధంగా అచ్చెంనాయుడు, రామానాయుడుకి కూడా వినతిపత్రం ఇచ్చారు. పుష్పగుచ్ఛాలు ఇచ్చి మంత్రులను సన్మానించారు. మాజీ ఏఎంసీ చైర్మన్ రామారావు, జిల్లా తెలుగు మహిళా అధ్యక్షురాలు వెంకటరమణ, పట్టణ టీడీపీ అధ్యక్షుడు జ్యేష్ఠ రామకృష్ణ, పట్టణ జనసేన అధ్యక్షుడు మాదేపల్లి శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

దళారుల చేతిలో 3,200 ఎకరాల భూమి


రాష్ట్ర మంత్రుల దృష్టికి భూ సమస్య తీసుకెళ్తున్న పోలవరం ఎమ్మెల్యే బాలరాజు

కుక్కునూరు, జూలై 27: పోలవరం ప్రాజెక్టు నిర్మాణంలో భూములు కోల్పోయిన కుక్కునూరు, వేలేరుపాడు మండలాల గిరిజనులకు జీలుగుమిల్లి, బుట్టాయిగూడెం ప్రాంతాల్లో ప్రభుత్వం భూమి ఇచ్చింది. దాదాపు 3,200 ఎకరాల భూములు నేటికి దళారుల చేతిలో ఉన్నాయని పోలవరం ఎమ్మెల్యే చిర్రి బాలరాజు శనివారం మంత్రుల సమక్షంలో తెలిపారు. మా భూములు మాకు ఇప్పించండి అంటూ దాదాపు వెయ్యి మంది పైగా రైతులు తనను కలిశారని ఎమ్మెల్యే తెలిపారు. గిరిజనులకు ఆ భూములు వచ్చేలా న్యాయం చేయాలని మంత్రులను కోరుతున్నట్లు పోలవరం ఎమ్మెల్యే చిర్రి బాలరాజు అన్నారు. దీంతో జలవనరుల శాఖ మంత్రి రామానాయుడు వెంటనే స్పందించారు. గిరిజనులకు ఇచ్చిన భూములను వారికి అందేలా చూడాలని జిల్లా కలెక్టర్ వెట్రిసెల్వికి సూచించారు.

పంచాయతీల బలోపేతంతోనే గ్రామ వికాసం


ప్రజలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే చింతమనేని

పెదవేగి, జూలై 27 : వైసీపీ పాలనలో పంచాయతీల నిధులను బొక్కేసిన జగన్‌రెడ్డి వాటి అభివృద్ధిని గాలికొదిలేయడంతో పంచాయతీలు నిర్వీర్యమయ్యాయని దెందూలూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ అన్నారు. దుగ్గిరాలలో ప్రజల సమస్యలు విన్న ప్రభాకర్ మాట్లాడుతూ పారిశుధ్యం నిర్వహణ సక్రమంగా లేక జనం ఆరోగ్య సమస్యలతో సతమతమవుతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. దీన్ని దృష్టిలో పెట్టుకుని కూటమి ప్రభుత్వం పంచాయతీల అభివృద్ధిపై దృష్టి సారించిందన్నారు. రహదారుల అభివృద్ధికి తొలి ప్రాధాన్యం ఇస్తూ ముందు కెళ్తామని, దీని కోసం పంచాయతీ రాజ్ శాఖా మంత్రి పవన్‌కల్యాణ్ భరోసా ఇచ్చారని ప్రభాకర్ వివరించారు. పార్టీ నాయకులు బొప్పన సుధాకర్, తాతా సత్యనారాయణ, మాగంటి నారాయణప్రసాద్, లావేటి శ్రీనివాసరావు, నంబూరి నాగరాజు పాల్గొన్నారు.

ప్లాట్‌ఫాంపై వేద పాఠశాల విద్యార్థి


బాలుడి నుంచి వివరాలు అడిగి తెలుసుకుంటున్న రైల్వే ఎస్‌ఐ సైమన్

ఏలూరు క్రైం, జూలై 27 : ఏలూరు పెద్ద రైల్వే స్టేషన్‌లో ప్లాట్‌ఫామ్‌పై 14 ఏళ్ల బాలుడు ఒంటరిగా, విచారంగా ఉండడంతో రైల్వే స్టేషన్‌లో పెట్రోలింగ్ నిర్వహిస్తున్న ఎస్‌ఐ పి.సైమన్ దృష్టిలో పడ్డాడు. వెంటనే ఆ బాలుడి వద్దకు వెళ్లి వివరాలడిగి తెలుసుకున్నారు. ఆ బాలుడి పేరు పటాకిమయూర్ గజానంద్ (14) అని ద్వారకాతిరుమల వేద పాఠశాలలో చదువుతున్నానని, స్వస్థలం నాదెండ్ అని, తాను వేద పాఠశాలలో ఉండలేక పారిపోయి వచ్చినట్లుగా ఎస్‌ఐకు తెలిపాడు. ఆ బాలుడి పూర్తి వివరాలు తెలుసుకుని కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. అనంతరం ఆ బాలుడిని జిల్లా చైల్డ్‌లైన్ సిబ్బందికి అప్పగించారు.

రైతులకు నష్టపరిహారం చెల్లించాలి

ఏలూరు కార్పొరేషన్, జూలై 27 : భారీ వర్షాలకు పంటలు నష్టపోయిన రైతులకు వెంటనే నష్ట పరిహారం చెల్లించాలని, ఖరీఫ్ సాగుకు అన్నదాత సుఖీభవ పెట్టుబడి సాయం రూ. 20 వేలు రైతులకు వెంటనే అందించాలని కోరుతూ ఏపీ రైతు సంఘం ఆధ్వర్యంలో శనివారం వ్యవసాయ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ శైలజకు వినతిపత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్, రైతు సంఘ నాయకులు నున్నా వెంకట్రావు, గంటి శ్రీనివాసరావు, వెజ్జు శ్రీరామచంద్రమూర్తి పాల్గొన్నారు.

ఆర్థిక వ్యవస్థను సర్వనాశనం చేసిన జగన్


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే చంటి

ఏలూరు టూ టౌన్, జూలై 27: రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను జగన్ సర్వనాశనం చేశాడని ఎమ్మెల్యే బడేటి రాధాకృష్ణయ్య అన్నారు. బడేటి క్యాంపు కార్యాలయంలో శనివారం విలేకర్ల సమావేశం నిర్వహించారు. అసెంబ్లీలో ఐదు రోజులు నిర్వహించిన అంశాలను ఆయన వివరించారు. జగన్‌తో సహా వైసీపీ ప్రజాప్రతినిధులు చేసిన పాపాలను ముఖ్యమంత్రి చంద్రబాబు శ్వేతపత్రాలను విడుదల చేసి, అసెంబ్లీలో పవర్ ప్రాజెక్టు ప్రజంటేషన్ ద్వారా వివరించారన్నారు. ప్రజల దృష్టి మళ్లించేందుకు 36 మంది హత్యకు గురయ్యారంటూ జగన్ కొత్త నాటకానికి తెర తీశారన్నారు. మాజీ డిప్యూటీ మేయర్ చోడే వెంకటరత్నం, నగర అధ్యక్షులు శివప్రసాద్, మాజీ కార్పొరేటర్ బాలాజీ పాల్గొన్నారు.

● తాడేపల్లి సెక్రటరేట్‌లో రిజిస్ట్రేషన్ కమిషనర్, ఇన్‌స్పెక్టర్ జనరల్ శేషగిరి బాబును ఎమ్మెల్యే చంటి మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. టీడీపీ నాయకులు మధ్యాహ్నపు బలరామ్ ఉన్నారు.

అబ్దుల్ కలామ్ సేవలు మరువలేనివి


అబ్దుల్ కలామ్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న సభ్యులు

జంగారెడ్డిగూడెం, జూలై 27 : మాజీ రాష్ట్రపతి డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలామ్ సేవలు మరువలేనివని అబ్దుల్ కలామ్ ఫౌండేషన్ చైర్మెన్ యర్రా అప్పారావు అన్నారు. కలాం వర్ధంతి సందర్భంగా శనివారం స్థానిక ఎస్‌డీ ఎస్ ప్రభుత్వ జూనియర్ కళాశాల, అశ్వారావుపేట రోడ్డులోని కలామ్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. విగ్రహదాత ఆకుల రామచంద్రరావు, ఫౌండేషన్ సభ్యులు పెనుమర్తి సురేష్, మల్లేశ్వరరావు, ప్రతిభారాజు, కళాశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

● పోలవరం : దివంగత మాజీ రాష్ట్రపతి శాస్త్రవేత్త అబ్దుల్ కలామ్ వర్ధంతి సందర్భంగా పోలవరంలో యువకులు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఆటో, టాక్సీ యూనియన్ నాయకులు షెహిన్షా బాషా, పటాన్ ఖాజా, సున్నం సుధీర్ బాబు పాల్గొన్నారు.

● భీమడోలు :ఏపీజే అబ్దుల్ కలామ్ వర్ధంతిని స్థానిక శాఖ గ్రంథాలయంలో గ్రంథపాలకుడు శ్రీనివాస్ అధ్యక్షతన నిర్వహించారు. కలామ్ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. భీమడోలు సర్కిల్ ఫోటోగ్రాఫర్ల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో అబ్దుల్ కలామ్ వర్ధంతి నిర్వహించారు. గౌరవాధ్యక్షులు బ్రహ్మారావు, అధ్యక్షులు శ్రీరామ్, మూర్తి, రంగారావు, నరేష్, వెంకటేశ్వరరావు, వేణు, కృష్ణ, ప్రభు పాల్గొన్నారు.

మోదీ ఇచ్చిన హామీలు అమలు చేయాలి

ఏలూరు కార్పొరేషన్, జూలై 27 : మోదీ ప్రభుత్వం రైతులకు ఇచ్చిన హామీలు అమలు చేయాలని, కేంద్ర బడ్జెట్‌లో వ్యవసాయ రంగానికి నిధులు కేటాయింపు పెంచాలని సంయుక్త కిసాన్ మోర్చ నాయకులు డిమాండ్ చేశారు. అన్నే భవనంలో శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో రైతాంగ కార్మిక వ్యతిరేక కేంద్ర బడ్జెట్‌పై 28, 29 తేదీల్లో నిరసనలు తెలియచేసి ఆగస్టు 9న కార్పొరేట్స్ క్విట్ ఇండియా డే నిరసన కార్యక్రమాన్ని నిర్వహిస్తామని ప్రకటించారు. సంయుక్త కిసాన్ మోర్చ నాయకులు కె.శ్రీనివాస్, బండి వెంకటేశ్వరరావు, పి.పెంటయ్య, రాజనాల రామ్మోహన్‌రావు, కేఎస్‌ఎన్ మూర్తి, వెజ్జు శ్రీరామచంద్రమూర్తి, నున్నా వెంకట్రావు తదితరులు ఉన్నారు.

డ్రెయిన్లలో పూడిక తొలగింపు

కామవరపుకోట, జూలై 27 : ఆడమిల్లిలో డ్రెయిన్లలో శనివారం పూడిక తీత పనులు చేపట్టారు. డ్రైన్లు పూడుకుపోయి మురుగునీరు రోడ్లపై ప్రవహించడంతో సర్పంచ్ గూడపాటి కేశవరావు, టీడీపీ బీసీ సెల్ నియోజకవర్గ అధ్యక్షుడు జుజ్జూరి బాబ్జి, యలమర్తి రాంబాబు పూడికతీత పనులు నిర్వహించి మురుగునీటి పారుదలకు చర్యలు తీసుకున్నారు.

మొక్కలతోనే పర్యావరణ పరిరక్షణ


వడ్డిగూడెంలో మొక్క నాటుతున్న సర్పంచ్ జయమంగళ దేవి

పెదపాడు, జూలై 27 : మొక్కలతోనే పర్యావరణ పరిరక్షణ కలుగుతుందని, ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని వడ్డిగూడెం సర్పంచ్ జయమంగళ దేవి అన్నారు. శిక్షా సప్తాహ్ కార్యక్రమంలో భాగంగా స్థానిక పాఠశాల ఉపాధ్యాయులు, తల్లిదండ్రుల ఆధ్వర్యంలో మొక్కలు నాటారు.

● పోలవరం : స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో పర్యావరణ పరిరక్షణ సంకల్ప యాత్ర కార్యక మంలో భాగంగా కూటమి నేతలు శనివారం అమ్మకి అంకితం కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థులు, వారి తల్లులతో మొక్కలు నాటించారు. జనసేన నాయకులు క్షేప్రసాద్, సీహెచ్ రత్నప్రసాద్, వి. సత్తిబాబు, కె. రాం బాబు పాల్గొన్నారు.

● దెందులూరు : మొక్కలను నాటి సంరక్షించడం మనందరి బాధ్యతాని బీఆర్‌డీ స్కూల్, నర్సింగ్ కాలేజీ కరస్పాం డెంట్ సుగ్గిశెట్టి నూకరాజు అన్నారు. దెందులూరు విజయనగేష్ డీఈడీ కాలేజీలో నిర్వహిచిన ప్రకృతి పరిరక్షణ దినోత్సవంలో మొక్కలు నాటారు.

● ద్వారకాతిరుమల : పంగిడిగూడెం జడ్పీ పాఠశాలలో శిక్షా సప్తాహ్‌లో విద్యార్థుల తల్లులతో మొక్కలు నాటించారు. హెచ్ఎం సురేష్, ఉపాధ్యాయులు శారద, మస్తాన్ బీబీ, కుమారస్వామి, పెద్దిరాజు, ప్రభాకర్, మల్లయ్య, రమేష్, పద్మ, మహాలక్ష్మి, జాన్సీ జయలక్ష్మి ఉషాదేవి పాల్గొన్నారు.

● ఉంగుటూరు : కైకరం హైస్కూలులో శిక్షా సప్తాహ్ కార్యక్రమంలో తల్లిదండ్రులతో కలిసి జెడ్పీటీసీ కొరిపల్లి జయలక్ష్మి మొక్కలు నాటారు. సర్పంచ్ సలగాల గోపి, ఎంపీటీసీ, చెన్ను సత్యవాణి, హెచ్ఎం గుళ్ళ ప్రసాదరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. ఉప్పాకపాడు పాఠశాలలో కూడా తల్లులు మొక్కలు నాటారు.

● ఏలూరు రూరల్, జూలై 27: శనివారపుపేట జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో శనివారం మొక్కలు నాటారు. హెచ్ఎం ప్రకాష్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

● భీమడోలు : వడ్లపట్ల ప్రాథమిక ఉన్నత పాఠశాలలో విద్యాశాఖాధికారి భాస్కర్‌కుమార్ విద్యార్థులు, తల్లిదండ్రులతో మొక్కలు నాటించారు. అనంతరం విద్యార్థులకు యూనిఫారమ్ పంపిణీ చేశారు. హెచ్ఎం ఝాన్సిరాణి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

● నిడమర్రు : ఫతేపురం ఉన్నత పాఠశాల ఆవరణ లో విద్యార్థుల తల్లులతో మొక్కలు నాటించారు. ఉప సర్పంచ్ రుద్రరాజు వెంకటేశ్వరరాజు (కొండరాజు) గ్రామ పెద్ద లక్ష్మీపతిరాజు, పేరెంట్స్ కమిటీ చైర్మెన్ దేవి , హెచ్ఎం, ఉపాధ్యాయుల పాల్గొన్నారు.

పారిశుధ్యంపై అప్రమత్తంగా ఉండండి


గ్రామ కార్యదర్శులతో మాట్లాడుతున్న డీపీఓ

వేలేరుపాడు, జూలై 27: వరద ప్రభావిత ప్రాంతాల్లో పారిశుధ్య నిర్వహణకు అత్యంత ప్రాధాన్యత ఇస్తూ అంటు వ్యాధులు ప్రబలకుండా బ్లీచింగ్, మలాథియాన్, తదితర సామగ్రి కొనుగోలు చేసి నిల్వ ఉంచాలని గ్రామ కార్యదర్శులను జిల్లా పంచాయతీ అధికారి తూతిగ శ్రీనివాస విశ్వనాథ్ ఆదేశించారు. మండలంలోని పంచాయతీ కార్యదర్శులతో శనివారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రెవెన్యూ, పౌర సరఫరాలు, వైద్య గ్రామీణ తాగునీరు తదితర శాఖలను సమన్వయం చేసుకుని కష్టకాలంలో ఉన్న ప్రజలకు సహకారం అందించాలన్నారు. పునరావాస కేంద్రాల్లో ఉన్న బాలింతలు, పిల్లలు, వృద్ధులు, దివ్యాంగులకు సౌకర్యాలు అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. భద్రాచలం వద్ద మూడో ప్రమాద హెచ్చరిక జారీ చేసినందున పంచాయతీ సిబ్బంది గ్రామాలను విడిచి వెళ్లవద్దని ఎవరైన విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈడీఎల్‌పీఓ రజాహుల్లా, ఎంపీడీఓ శ్రీహరి, తదితరులు పాల్గొన్నారు.

అస్తవ్యస్తంగా విద్యా వ్యవస్థ


వినతిపత్రం అందజేస్తున్న యూటీఎఫ్ నాయకులు

ఏలూరు రూరల్, జూలై 27: విద్యారంగ సమస్యలను పరిష్కరించాలని, యూటీఎఫ్ రాష్ట్ర సంఘం పిలుపు మేరకు ఏలూరు జిల్లా కమిటీ ఆధ్వర్యంలో శనివారం కలెక్టరేట్‌లో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ పెరిగిన పని భారంతో సమస్యలు పరిష్కారంగాక ఉపాధ్యాయులు తీవ్ర అసంతృప్తిలో ఉన్నారన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఒకే సిలబస్, ఒకే పరీక్షతా విధానం అమలు చేయాలని, రెండు మీడియంలను సమాంతరంగా కొనసాగించి, పని భారం తగ్గించి నాన్ టీచింగ్ సిబ్బందిని నియమించాలని, తదితర డిమాండ్లు చేశారు. అనంతరం కలెక్టర్ అందుబాటులో లేకపోవడంతో ఏవోకు వినతిపత్రం అందించారు. జిల్లా అధ్యక్షుడు ముస్తఫాఅలీ, ప్రధాన కార్యదర్శి రవికుమార్, సుభాషిణి, రంగమోహన్, అపర్ణ, సుధారాణి పాల్గొన్నారు.

జగన్ మాటలు హాస్యాస్పదం

పెదవేగి, జూలై 27 : ప్రజలకు అన్యాయం జరిగిపోతుందని జగన్ ఆక్రోశించడం హాస్యాస్పదంగా ఉందని కాంగ్రెస్ పార్టీ దెందులూరు నియోజకవర్గం ఇన్‌చార్జి ఆలపాటి నరసింహమూర్తి మండిపడ్డారు. ముండూరులో శనివారం విలేకరులతో మాట్లాడుతూ శాసనసభకు రాకుండా ఢిల్లీ వీధుల్లో ధర్నాలు చేయడం వింతగా ఉందన్నారు. కాంగ్రెస్ పార్టీ ఏపీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల ఓటమి చెందినా ప్రజల మధ్య తిరుగుతూ ప్రజలతో మమేకమై ఉన్నారని, ఇది రాజకీయ నాయకుల లక్షణమనే విషయాన్ని మరచిన మాజీ ఎమ్మెల్యే అబ్బయ్య చౌదరి, కార్యకర్తలను వదిలేసి, విదేశాలకు పారిపోయాడని ఆలపాటి ఎద్దేవా చేశారు.

చట్టాలపై మహిళలకు అవగాహన

కామవరపుకోట, జూలై 27 : ఐసీడీఎస్ ఆధ్వర్యంలో శనివారం వంద రోజుల కార్యక్రమంలో భాగంగా మహిళా చట్టాల గురించి మండలంలో శనివారం అవగాహన ప్రదర్శనలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఐసీడీఎస్ సూపర్‌వైజర్ బీవీఎల్ మంగాదేవి, వీరకుమారి లింగ వివక్షత, బాల్య వివాహం, గృహహింస, అక్రమ రవాణా, నిరోధక చట్టం వంటి అంశాలను వివరించారు. పర్విన్, అంగన్‌వాడీలు పాల్గొన్నారు.

కార్యవర్గం ఎన్నిక

భీమడోలు, జూలై 27 : ఏపీ రిటైర్డ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ కార్యవర్గ ఎన్నిక శనివారం జరిగింది. యూనియన్ అధ్యక్షుడు ఆంజనేయులు, కె.మహాలక్ష్మి గంగాధర రావు సమక్షంలో భీమడోలు యూనిట్ నూతన అధ్యక్షుడిగా కె.సత్యనారాయణ, అసోసియేట్ అధ్యక్షుడిగా ఎన్‌సీ కోటయ్యను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యవర్గ సభ్యులు పరదేశిరావు, వైఆర్‌కే శర్మ, వసంతరావు, జి.వెంకట్రావు, రామారావు సభ్యులు పాల్గొన్నారు.

పేకాటరాయుళ్ల అరెస్టు

ఏలూరు క్రైం, జూలై 27 : ఏలూరు రూరల్ మండలం బీడీ కాలనీలో శనివారం రాత్రి పేకాట ఆడుతున్నట్లు ఏలూరు వన్ టౌన్ సీఐ ఎన్.రాజశేఖర్‌కు సమాచారం అందింది. ఆయన ఆదేశాల మేరకు వన్ టౌన్ ఎస్‌ఐ రాజారెడ్డి దాడి చేశారు. అక్కడ పేకాట ఆడుతున్న ఆరుగురిని అరెస్టు చేశారు. వారి నుంచి రూ.18 వేల 610లు స్వాధీనం చేసుకున్నారు.

యువతిని మోసం చేసిన యువకునిపై కేసు

టి.నరసాపురం, జూలై 27: వివాహం చేసుకుంటానని నమ్మించి యువతిని మోసం చేసిన యువకుని పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై దుర్గా మహేశ్వరరావు తెలిపారు. మండలంలోని ఒక గ్రామానికి చెందిన యువతిని అదే గ్రామానికి చెందిన యువకుడు సోడెం నాగరాజు రెండేళ్లుగా ప్రేమిస్తున్నానని వెంటపడి వేధించి మోసం చేసిన విషయం పెద్దలు దృష్టికి వెళ్లింది. 2023 ఆగస్టులో ఇద్దరికి పెద్దల సమక్షంలో నిశ్చితార్థం జరిగింది. ఆ తరువాత వివాహం చేసుకోనని బెదిరించడంతో యువతి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేయగా జీలుగుమిల్లి సీఐ టి.క్రాంతికుమార్ కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై చెప్పారు.

సమాచారం

నేడు కన్స్యూమర్ ప్రొడక్ట్స్ డిస్ట్రిబ్యూటర్ల వేడుక

ఏలూరు రూరల్, జూలై 27: ఫెడరేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ కన్స్యూమర్ ప్రొడక్ట్స్ డిస్ట్రిబ్యూటర్స్ అసోసియేషన్ 30 వసంతాల వేడుకలు ఏలూరు నేరెళ్ళ రాజా కల్యాణ మండపంలో నిర్వహిస్తున్నట్లు అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ఎంసీఎస్ ప్రసాద్ శనివారం విలేకర్ల సమావేశంలో తెలిపారు. శనివారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ భవిష్యత్తు కార్యాచరణను ప్రకటించేందుకు ఈ సదస్సు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జాతీయ నాయకులు ఆర్. సత్యనారాయణ మాట్లాడుతూ ఈ సమావేశంలో కొన్ని కఠిన నిర్ణయాలు తీసుకుంటామన్నారు. ఏలూరు కన్స్యూమర్ ప్రొడక్ట్స్, డిస్ట్రిబ్యూటర్స్, హోల్‌సెల్లర్స్ అసోసియేషన్ గౌరవాధ్యక్షుడు ఎంటీవీ సత్యకుమార్ మాట్లాడుతూ నేడు డిస్ట్రిబ్యూటర్ పరిస్థితి ప్రశ్నార్థకంగా మారిందన్నారు. మాల్స్ వలన గ్రామీణ ప్రాంతాల్లో కిరాణా షాపులు చాలా వరకు మూతపడ్డాయన్నారు. ఇటీవల కేంద్ర బడ్జెట్‌లో వారపు సంతలు ఏర్పాటు చేస్తామనడంపై హర్షం వ్యక్తం చేశారు. ఈ సదస్సుకు ఏలూరు ఎంపీ పుట్టా మహేష్‌కుమార్ యాదవ్, ఎమ్మెల్యే బడేటి చంటి, అసోసియేషన్ నాయకులు హాజరు కానున్నారని తెలిపారు. అధ్యక్షుడు మురళీకృష్ణ, కార్యదర్శి సత్యప్రకాష్, కోశాధికారి నాగేశ్వరరావు, సీహెచ్ రవికృష్ణ, గిరిధర్, శ్రీహరి, దిలీప్‌కుమార్, అయ్యప్ప తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యా విజ్ఞాన సదస్సు

జంగారెడ్డిగూడెం, జూలై 27 :స్థానిక ఆలపాటి గంగాభవానీ కళ్యాణ మండపంలో ఆదివారం ఉదయం తొమ్మిది గంటకు విద్యా విజ్ఞాన సదస్సు జరుగుతుందని రిటైర్డ్ ప్రధానోపాధ్యాయుడు గడా జగ్గారావు శనివారం తెలిపారు. ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఉద్యోగులు, ఉపాధ్యాయులు హాజరవుతారని తెలిపారు.

నేటితో ముగియనున్న సభ్యత్వ నమోదు

ఏలూరు కార్పొరేషన్, జూలై 27 : ఏలూరు నగరంలో జనసేన క్రియాశీల సభ్యత్వం నమోదు ఆదివారంతో ముగుస్తుందని ఉభయగోదావరి జిల్లాల జనసేన అధికార ప్రతినిధి రెడ్డి అప్పలనాయుడు తెలిపారు. ఆయన వెంట జనసేన నాయకులు నగిరెడ్డి కాశీ నరేష్, సరిది రాజేష్, రెడ్డి గౌరీశంకర్, రమణ, బోండా రామునాయుడు తదితరులు ఉన్నారు.

31న పాలిటెక్నిక్‌లో స్పాట్ అడ్మిషన్లు

జంగారెడ్డిగూడెం, జూలై 27 :స్థానిక ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో 2024 కన్వీనర్ కోటాలో అడ్మిషన్లు ముగియడంతో మిగిలిన సీట్ల భర్తీకి ఈ నెల 31వ తేదీ ఉదయం 10.30 గంటలకు స్పాట్ అడ్మిషన్లు నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ పి.సుబ్రహ్మణ్యం శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. సివిల్, మెకానికల్ ఇంజనీరింగ్‌లలో చేరుటకు పదో తరగతి పాసైన వారు 30వ తేదీ సాయంత్రం ఐదు గంటలలోపు దరఖాస్తును ప్రిన్సిపాల్‌కు అందజేయాలని సూచించారు.

11న విశ్వబ్రాహ్మణ సంఘ వార్షికోత్సవం

ఏలూరు కార్పొరేషన్, జూలై 27 : విశ్వబ్రాహ్మణ సంఘం తొమ్మిదో వార్షికోత్సవం ఆగస్టు 11వ తేదీ ఫైర్‌స్టేషన్ సెంటర్‌లోని రెవెన్యూ భవనంలో నిర్వహిస్తున్నామని సంఘ అధ్యక్షులు అప్పలబత్తుల శివకేశవరావు తెలిపారు. వన్ టౌన్‌లోని వీరబ్రహ్మంగారి గుడి వద్ద వార్షికోత్సవానికి సంబంధించిన బ్రోచర్లను శనివారం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర సంఘ నాయకులు, ప్రజాప్రతినిధులు పాల్గొంటారని తెలిపారు. విశ్వబ్రాహ్మణ సంఘ నాయకులు సింహాద్రి బ్రుంగాచార్యులు, మానేపల్లి నాగేశ్వరరావు, వేముల దుర్గాప్రసాద్‌పాల్గొన్నారు.

ఆదుకుంటాం..

“ వరదల కారణంగా ఇబ్బందుకల పడుతున్న బాధితుల దగ్గరకు వెళ్లండి.. ఇప్పటి వరకు అందిన సాయం.. ఇంకా ఏం కావాలో తెలుసుకోండి.. అని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆదేశించారు. అందుకే మమేంతా కలిసి వచ్చాం..” అని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు, జలవనరుల శాఖ మంత్రి డాక్టర్ నిమ్మల రామానాయుడు, హోంశాఖ మంత్రి వంగలపూడి అనిత, గృహ నిర్మాణ శాఖ మంత్రి కొలుసు పార్థసారధి అన్నారు. శనివారం మంత్రుల బృందం ఉమ్మడి జిల్లాలోని వరద ప్రభావిత ప్రాంతాల్లో పర్యటించారు.. బాధితులను పరామర్శించి వారికి సాయం అందిస్తామని చెప్పారు.

ఇది ప్రజా ప్రభుత్వం..సేవ కోసమే పని చేస్తున్నాం

జగన్ ప్రభుత్వ నిర్లక్ష్యం వల్లే ఈ కష్టాలు

వరద ప్రభావిత ప్రాంతాల్లో పర్యటించిన మంత్రులు

అచ్చెన్నాయుడు, రామానాయుడు, పార్థసారథి, అనిత

ఆదుకుంటామంటూ బాధితులకు భరోసా



చనుబండలో స్థానిక నాయకులతో మాట్లాడుతున్న మంత్రులు

కుక్కునూరు, జూలై 27: తమది ప్రజా ప్రభుత్వమని ప్రజలకు ఏ ఇబ్బందులు తలెత్తినా తక్షణమే స్పందిస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వరద ప్రభావిత ప్రాంతాల్లో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా తక్షణ చర్యలు తీసుకోవాలని ఆదేశించటంతో ప్రజల ఇబ్బందులు తెలుసుకుంటున్నామని మంత్రి అచ్చెన్నాయుడు అన్నారు. దాచారం పునరావాస కాలనీలో బాధితులతో మంత్రి అచ్చెన్నాయుడు మాట్లాడుతూ వరద ముంపు బాధితులకు పూర్తి స్థాయిలో సహాయం అందించాలని సీఎం ఆదేశాలు జారీ చేశారన్నారు. వరద ప్రమాదం తగ్గిన తరువాత బాధితులను ఇంటి వద్దకు క్షేమంగా చేరేలా అధికారులు చర్యలు తీసుకుంటారన్నారు. మంత్రి డాక్టర్ నిమ్మల రామానాయుడు మాట్లాడుతూ పెదవాగు ప్రాజెక్టు ద్వారా 14 వేల ఎకరాలు ఆంధ్రప్రదేశ్‌లో సాగవు తుందని పెదవాగు ప్రాజెక్టు మరమ్మ తులకు, గోదవరి బోర్డు 85 శాతం ఆంధ్రప్రదేశ్, 15 శాతం తెలంగాణ ప్రభుత్వం నిధులు కేటాయించాల్సి ఉందన్నారు. అయితే 80 కోట్ల రూపా యలు మరమ్మతులకు అంచనాలు రూపొందించగా గత ప్రభుత్వం తన వాటా చెల్లించకుండా పెడచెవిన పెట్టిందన్నారు. ఆ నిర్లక్ష్యం కారణంగా ప్రస్తుతం ప్రాజెక్టు కొట్టుకు పోవడంతో ప్రజలు ఎన్నో ఇబ్బందులు పడు తున్నారన్నారు. పెదవాగు ప్రాజెక్టు మరమ్మత్తులకు ప్రణాళికలు రూపొం దించి బడ్జెట్ కేటాయిస్తామన్నారు. మంత్రి పార్థసారధి మాట్లాడుతూ గోదారి వరదల కారణంగా నష్టపోయిన ప్రతీ కుటుంబాన్ని ఆదుకుంటామన్నారు. మంత్రి వంగలపూడి అనిత మాట్లాడుతూ రాష్ట్ర ప్రజలకి దోహదం చేసే పోలవరం ప్రాజెక్టు కోసం భూములు త్యాగం చేసిన నిర్వాసితులకు నష్టపరిహారం త్వరితగతిన అందిం చేందుకు ముఖ్యమంత్రి కృతనిశ్చయంతో ఉన్నారని అన్నారు. కలెక్టర్ వెట్రిసెల్వి, ఎస్పీ కేప్రతాప్ శివకిషోర్, జాయింట్ కలెక్టర్ ధాత్రిరెడ్డి, పోలవరం ఎమ్మెల్యే చిర్రిబాలరాజు, దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్, జడ్పీసీఈవో సుబ్బారావు, డీపీవో శ్రీనివాస విశ్వనాథ్, డ్వామా పీడీ రాము తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకు ఏ ఇబ్బందులు రానివ్వం..

వేలేరుపాడు : వేలేరుపాడు మండలంలోని కన్నాయిగుట్ట గ్రామంలో వరద పరిస్థితిని మంత్రులు పరిశీలించారు. వరదల కారణంగా ప్రభుత్వపరంగా అందిస్తున్న సాయంపై ఆరా తీశారు. ఇప్పటి వరకు జిల్లా కలెక్టర్‌తో సహా అధికారులంతా తమను బాగానే చూసుకుంటున్నారని బియ్యం, నిత్యావసర సరుకులు అందించారని ప్రజలు చెప్పడంతో మంత్రులు సంతృప్తి వ్యక్తం చేశారు. వరద చుట్టుముట్టిన గ్రామాల ప్రజ లకు కుటుంబానికి రూ.3 వేలు చొప్పున సాయం అందిస్తామని మంత్రులు చెప్పడంతో గ్రామస్థులు హర్షం వ్యక్తం చేశారు. గతంలో కొంతమందికే ఆర్అండ్ఆర్ ప్యాకేజీ ఇచ్చారని ఇంకా 65 కుటుంబాలకు తమ గ్రామంలో ఆర్అండ్ఆర్ ప్యాకేజీ ఇవ్వాల్సి ఉందని గిరిజనులు మంత్రులకు విన్న వించారు. తమ ప్రభుత్వం కొంచెం కుదుటపడ్డాక అందరికీ ప్యాకేజీ చెల్లిస్తామని కొంచెం ఓపిక పట్టాలని సూచించారు.

తణుకు : తణుకు మండలం దువ్వ గ్రామంలో ఎమ్మెల్యే ఆరి మిల్లి రాధాకృష్ణ ఆధ్వర్యంలో మంత్రులు శనివారం సాయంత్రం పరి శీలించారు. దువ్వ వయ్యేరు కాలువపై ఉన్న పాత వంతెన పరిశీలించారు. నీట మునిగిన వరిపొలాలను పరిశీలించారు. అనంతరం అత్తిలి మండలం వరిఘేడు, తిరుపతిపురం గ్రామాల్లో పంట పొలాలను పరిశీలించారు.

పెనుమంత్ర : ఇది ప్రకృతి వైపరీత్యం కాదు..గత వైసీపీ ప్రభుత్వ వైఫల్యమే.. కాలువలను, డ్రెయినేజీలను ఐదేళ్లలో కనీసం పట్టించుకోక పోవ డంతో తూడు, గుర్రపుడెక్కతో పూడుకుపోయి డ్రెయిన్లు లాగక పొలాలు ముంపు బారిన పడ్డాయని మంత్రి ఆరోపించారు. పెనుమంత్ర మండలం సోమరాజు ఇల్లిందలపర్రులో గోస్తనీ నది, జీఅండ్‌వీ కెనాల్ పోటెత్తడంతో ముంపునకు గురైన పంట పొలాలను పరిశీలించారు. మంత్రి అచ్చెన్నాయుడు మాట్లాడుతూ వచ్చే వేసవిలో జీఅండ్‌వీ కెనాల్, గోస్తనీ నది ఆధునీకరణ పనులు చేపడతామని హామీ ఇచ్చారు. గత వైసీపీ పాలకులు రైతుల ఖాతాలో ధాన్యం సొమ్ము జమ చేయలేదని 1600 కోట్ల రూపాయలు బకాయిలు పెడితే నాబార్డు నుంచి వెయ్యి కోట్లు అప్పు తెచ్చి రైతుల ఖాతాలో జమ చేశామన్నారు మరో రూ.600 కోట్లు ఐదు ఆరు రోజుల్లో జమ చేస్తామని చెప్పారు.ఎమ్మెల్యేలు పితాని సత్యనారాయణ, ఆరుమిల్లి రాధాకృష్ణ ఉన్నారు.

బాధితులకు రూ.3 వేలు నగదు, నిత్యావసర సరుకులు

దాచారం పునరావాస కాలనీలో ఉంటున్న 250 మంది గొమ్ముగూడెం నిర్వాసితులకు 25 కేజీల బియ్యం, 3 వేలు నగదు, కేజీ చొప్పున కందిపప్పు, ఉల్లిపాయలు, బంగాళదుంపలు, పామాయిల్ అందజేశారు. మూడు పునరావాస కేంద్రాల్లోని దాదాపు 1200 కుటుంబాలకు సహాయం అందించారు. దువ్వలో 1,198 వరద బాధిత కుటుంబాలకు 25 కేజీల బియ్యం, కేజీ పామాయల్, ఉల్లి, కంది, బంగాళ దుంపలు అందజేశారు.

చింతలపూడికి ప్రాధాన్యం : మంత్రి అచ్చెన్న

చాట్రాయి: సీఎం చంద్రబాబు నాయుడు ప్రాధాన్యతలలో చింతలపూడి ఎత్తిపోతల పథకం ఒకటని, ఈ ప్రాజెక్టును పూర్తి చేసి గోదావరి జలాలతో నూజివీడు నియోజకవర్గంతో పాటు మెట్ట ప్రాంతాన్ని సస్యశ్యామలం చేస్తామని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు అన్నారు. శనివారం ఆయనతో పాటు హోంమంత్రి అనిత, జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు, గృహ నిర్మాణ శాఖ మంత్రి కొలుసు పార్థసారధి వేలేరుపాడు, కుక్కునూరు మండలాల్లో వరద బాధితులను పరామర్శించేందుకు వెళుతూ అల్పాహారం తీసుకునేందుకు చనుబండ ఆర్యవైశ్య ప్రముఖుడు నడిపల్లి కిషోర్ గృహంలో కొద్దిసేపు ఆగారు. చింతలపూడి ఎత్తిపోతల పథకాన్ని వైసీపీ హయాంలో మూలపడేశారని, ఈ పథకాన్ని పూర్తిచేస్తే ఏలూరు, ఎన్టీఆర్ జిల్లాల్లో 5 లక్షల ఎకరాల మెట్ట భూముల్లో బంగారు పంటలు పండటంతో పాటు, వందల గ్రామాలకు తాగునీటి సమస్య తీరుతుందని, తాను చింతలపూడిని పూర్తి చేస్తానని ఎన్నికల్లో ప్రజలకు హామీ ఇచ్చానని మంత్రి పార్థసారథి అచ్చెన్నాయుడికి వివరించారు. అనంతరం మంత్రుల కాన్వాయ్ బయలుదేరి వెళ్ళింది. తెలుగురైతు జిల్లా ప్రధాన కార్యదర్శి మోరంపూడి శ్రీనివాసరావు, టీడీపీ నాయకులు పుచ్చకాయల నోబుల్ రెడ్డి, జక్కంపూడి ప్రదీప్ కుమార్, కార్యకర్తలు మంత్రులను కలిశారు.



ఇంతకు ముందెప్పుడూ ఇలా రాలేదు..

మంత్రుల ఎదుట ఆనందం వ్యక్తం చేసిన బాధితులు

కుక్కునూరు : వరద బాధితుల సమస్యలు తెలుసుకోవడానికి మంత్రులు కుక్కునూరులోని దాచారం పునరావాస కాలనీలో నిర్వాసితు లతో బేటీ అయ్యారు. అధికారులు తమకు చేసిన సేవలను వారంతా మంత్రుల ఎదుట సంతోషంగా వ్యక్తం చేశారు. “వరద పెరుగుతుందని తెలిసిన వెంటనే కలెక్టర్ వెట్రిసెల్వి, మండల ప్రత్యేకాధిరులు, స్థానికాధికారులు మా గ్రామా నికి విచ్చేశారు. ఇళ్లు ఖాళీ చేసేందుకు ట్రాక్టర్లు ఏర్పాటు చేసి పునరావాస కేంద్రాలకు తీసుకొచ్చారు. విద్యుత్ సౌకర్యం, తాగునీరు ఏర్పాటు చేశారు. 3 రోజుల పాటు భోజనవసతి ఏర్పాటు చేశారు. రెండు రోజులుగా బియ్యం, కూరగాయలు, నిత్యావసర సరుకులు అందించటంతో మేమే వండు కుని తింటున్నాం. అధికారులు రోజు వస్తున్నారు..మీకేం కావాలని పదేపదే అడుగుతున్నారు. మాకు కష్టం లేకుండా చూస్తున్నారు..”అని కొమ్ము గూడెంకు చెందిన సముద్రాల రజిత చెప్పుకొచ్చారు. నిజంగా అందుతున్నాయా లేక అలా చెప్పమం టున్నారా అని మంత్రి అచ్చెన్నా యుడు వ్యాఖ్యానించగా అలా ఏమీ లేదని అధికారులు బాగా చూస్తున్నారని బాధితులు తెలిపారు.

గ్రామాల్లో ‘టీమ్ ఏలూరు’

విపత్కర పరిస్థితుల్లో సాయం చేసేందుకు ముందుకు రండి

కొత్త పద్ధతికి నాంది పలికిన కలెక్టర్ వెట్రిసెల్వి



కుక్కునూరు, జూలై 27 : దాచారం పునరావాస కాలనీలో శనివారం జిల్లా కలెక్టర్ వెట్రిసెల్వి వదరబాధితులతో మాట్లాడు తూ ఒక ఆసక్తికరమైన విషయాన్ని చెప్పారు. జిల్లావ్యాప్తంగా గ్రామాల్లో టీమ్ ఏలూరు ఏర్పాటు చేశామని గ్రామాల్లో విపత్కర పరిస్థితులు ఎదురైనప్పుడు వీరంతా సాయం చేయా లన్నారు.. వలంటీర్లుగా సేవలందించేందుకు ప్రతీ గ్రామం నుంచి ఎవరైనా ముందుకు రావచ్చన్నారు. వారికి ప్రత్యేకంగా టీమ్ ఏలూరు పేరుతో టీషర్టులు అందిస్తాం.. వారంతా గ్రామాల్లో ఎటువంటి విపత్కర పరిస్థితి ఎదురైన వెంటనే జిల్లా అధికారులకు సమాచారం అందించాలి. తద్వారా ఆ సమస్య పరిష్కారానికి అధికారులు వేగవంతంగా చర్యలు చేపడతారు. ప్రస్తుతం ముంపుబాధిత గ్రామాల నుంచి ఎవరైనా వలంటీర్లుగా సేవలందించడానికి ముందుకు వస్తారా అని కలెక్టర్ అడిగారు. దీంతో దాదాపు 15 మంది యువతీ యువకులు తమ గ్రామాల్లో పని చేయడానికి సిద్ధమైనట్లు కలెక్టర్ తెలిపారు. కలెక్టర్ నవ్వుతూ మీ సేవకు జీతాలు మాత్రం ఉండవన్నారు. కొమ్ముగూడెం గ్రామం ముంపునకు గురవుతున్న సమయంలో ఆ గ్రామానికి చెందిన పలువురు యువకులు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి గ్రామస్థులను పునరావాస కేంద్రాలకు తరలించడానికి సహకరించారు. కలెక్టర్ వారికి అభినందనలు తెలిపారు.

అపరిచిత వ్యక్తులతో అప్రమత్తంగా ఉండాలి



కైకలూరు, జూలై 27: విద్యార్థినులు అపరిచిత వ్యక్తుల పట్ల అప్రమత్తంగా ఉండాలని కైకలూరు సీనియర్ న్యాయాధికారిణి వీవీఎన్‌వీ లక్ష్మి అన్నారు. శనివారం కైకలూరు బీసీ బాలికల కళాశాల వసతి గృహాన్ని తనిఖీ చేశారు. మెనూ, భోజనం, వసతులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నేడు సెల్‌ఫోన్ల వ్యామోహంలో అనేక మంది అపరిచిత వ్యక్తుల మాయలోపడి మోసపోతున్నారని అందువల్ల సోషల్ మీడియాలో స్నేహాల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. తల్లిదండ్రులను వదిలి వసతి గృహాల్లో ఉంటూ విద్యను అభ్యసించే విద్యార్థుల పట్ల వివక్ష చూపడం నేరమన్నారు. అలాగే చట్టాల పట్ల అవగాహన కలిగి ఉండాలని విద్యార్థినులను కోరారు. న్యాయవాదులు ఎంవీవీ సత్యనారాయణ, పి. పవన్‌కాంత్, డి. శివప్రసాద్, అడగర్ల రాంబాబు, ఏఎస్సై మల్లికార్జునరావు, వార్డెన్ రాధ తదితరులు పాల్గొన్నారు.



అబ్దుల్ కలాం యువతకు స్ఫూర్తి

కైకలూరు, జూలై 27 : భారత మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాం ఆశయాలు మహోన్నతమైనవని నేటి యువత వాటిని ఆచరించి సన్మార్గంలో నడవాలని కైకలూరు సర్పంచ్ డీఎం నవరత్నకుమారి అన్నారు. కలాం వర్ధంతిని పురస్కరించుకుని శనివారం కైకలూరు పంచాయతీ కార్యాలయంలోని కలాం విగ్రహానికి ఆమె 9వ వర్ధంతి సందర్భంగా పూలమాల వేసి నివాళులు అర్పించారు. మానవత మాజీ అధ్యక్షుడు కొండ్రెడ్డి సత్యనారాయణ, సంస్థ సభ్యులు గుర్రం శ్యాంకుమార్, వేణుగోపాలరావు, తలారి రామరావు, దుర్గరాజు, వార్డు సభ్యులు బెల్లాని శ్యామలరావు, శివ, ఇమ్మడి విఠల్, శీలం కృష్ణవేణి, గాలీబ్ బాబు, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

గొల్లపల్లిలో తల్లికి వందనం

నూజివీడు టౌన్, జూలై 27: గొల్లపల్లి అన్నే రామకృష్ణయ్య జడ్పీ ఉన్నత పాఠశాలలో తల్లికి వందనం పేరిట మొక్కలు నాటే కార్యక్రమాన్ని నిర్వహించారు. పచ్చదనంతో వాతావరణ కాలుష్యాన్ని నివారించాలని గొల్లపల్లి మాజీ సర్పంచ్ భోగినేని శ్రీనివాస కుమార్ అప్పారావు అన్నారు. ఉపాధ్యాయ కమిటీ సభ్యులు, విద్యార్థులు పాల్గొన్నారు.



మండవల్లి: మండవల్లి జిల్లా పరిషత్ హైస్కూల్‌లో అమ్మకి మొక్క అనే కార్యక్రమంలో శనివారం మొక్కలు నాటి కార్యక్రమాన్ని శ్రీకారం చుట్టారు. ఈ కార్యక్రమంలో ప్రజాస్వామ్య పరిరక్షణ కమిటీ సభ్యుడు విజయకుమార్, టీడీపీ నాయకులు విద్యాకమిటీ మాజీ చైర్మన్ ముళ్లపూడి సత్తిబాబు, పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యార్థులకు యూనిఫాం పంపిణీ

ముదినేపల్లి, జూలై 27 : మండలంలోని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు యూనిఫాం, బ్యాగ్‌లు, బూట్లు, పుస్తకాల పంపిణీ పూర్తయింది. మండలంలోని 48 ప్రాథమిక, 11 యూపీ, 8 హైస్కూళ్ల విద్యార్థులు 3656 మందికి ఎంఈవో నరేష్ కుమార్ ఆధ్వర్యంలో శనివారంతో పంపిణీ పూర్తి చేశారు. పెయ్యేరు పాఠశాలలో ఏపీటీఎఫ్ జిల్లా కార్యదర్శి బేతాళ రాజేంద్ర ప్రసాద్ బ్యాగులను శనివారం పంపిణీ చేశారు.



సానారుద్రవరంలో ధర్నా చేస్తున్న మృతుడి బంధువులు, గ్రామస్థులు

న్యాయం జరిగే వరకు అంత్యక్రియలు జరపం

కలిదిండి, జూలై 27 : ఆత్మహత్య చేసుకున్న విన్నకోట రామకృష్ణ కుటుంబానికి న్యాయం చేసే వరకు అతని అంత్యక్రియలు నిర్వహించమని శనివారం సానారుద్రవరంలో మృతుడి కుటుంబీకులు, గ్రామస్థులు ధర్నా నిర్వహించారు. పరిస్థితి ఉద్రిక్తంగా మారటంతో మాజీ ఎమ్మెల్సీ కమ్మిలి విఠల్‌రావు, సొసైటీ మాజీ అధ్యక్షుడు చిట్టూరి రవీంద్ర, జనసేన నాయకులు కొల్లి బాబి, నల్లగోపుల చలపతిరావు బాధిత కుటుంబానికి న్యాయం చేస్తామని హామీ ఇవ్వటంతో ధర్నా విరమించారు. అనంతరం రామకృష్ణ మృతదేహానికి అంత్యక్రియలు నిర్వహించారు. ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరుగకుండా డీఎస్పీ ఇ.శ్రీనివాసులు ఆధ్వర్యంలో బందోబస్తు నిర్వహించారు.

కాపు సంఘ నేత ఆర్థిక సాయం

ముదినేపల్లి: మృతుడు విన్నకోట రామకృష్ణ కుటుంబానికి కాపు సంక్షేమ సంఘం కైకలూరు నియోజకవర్గ అధ్యక్షుడు వర్రె హనుమాన్ ప్రసాద్ రూ.25 వేలు ఆర్థిక సహాయం అందజేశారు. శనివారం ఆయన రామకృష్ణ కుటుంబ సభ్యులను పరామర్శించి సహాయం అందించారు.

డ్రెయినేజీ పూడికతీత

ముసునూరు, జూలై 27: కాట్రేనిపాడు పంచాయతీ పరిధిలో సర్పంచ్ గద్దల సుహాసిని మోహన్‌రావు ఆధ్వర్యంలో డ్రెయినేజీ పూడికతీత పనులు శనివారం చేపట్టారు. హరిశ్చంద్రపురం ప్రధాన, అంతర్గత రహదారులకిరువైపులా ఎక్స్‌కవేటర్‌తో డ్రెయినేజీల్లో పూడిక తొలగించి ట్రాక్టర్ల ద్వారా బయటకు తరలించారు. మరికొన్ని చోట్ల కచ్చా డ్రెయిన్లు తీశారు. పారిశుధ్య మెరుగుకు, దోమల నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు సర్పంచ్ తెలిపారు.



అమరవీరులకు ట్రిపుల్ ఐటీ విద్యార్థుల నివాళి

కార్గిల్ అమర వీరులకు నివాళి

నూజివీడు టౌన్, జూలై 27: కార్గిల్ యుద్ధంలో అసువులు బాసిన సైనికులకు నూజివీడు ట్రిపుల్ ఐటీ ఎన్‌సీసీ క్యాడెట్స్ కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించి ఘనంగా నివాళులర్పించారు.



కార్గిల్ యుద్ధ వీరుడికి సన్మానం

కైకలూరు జూలై 27 : కార్గిల్ విజయం భారతీయు లందరికీ గర్వకారణమని మాజీ జడ్పీటీసీ ముదునూరు సీతారామరాజు అన్నారు. శనివారం భుజబల పట్నం జడ్పీ హైస్కూల్లో కార్గిల్ విజయ్ దివస్ సందర్భంగా కార్గిల్ యుద్ధంలో పాల్గొన్న మాజీ సైనికుడు డేవిడ్ రాజును ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ కార్గిల్ యుద్ధంలో వీరోచిత పోరాటాన్ని ప్రదర్శించి భారత సైనికులు పాకిస్తాన్‌కు బుద్ధి చెప్పారన్నారు. అప్పుడు యుద్ధం జరిగిన తీరును డేవిడ్‌రాజు విద్యార్థులకు వివరించారు. ప్రధానోపాధ్యాయులు లక్ష్మీరాజేశ్వరి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నేడు తమ్మిలేరు నుంచి నీటి విడుదల

చాట్రాయి, జూలై 27: నూజివీడు ఎమ్మెల్యే, మంత్రి కొలుసు పార్థసారథి ఆదివారం ఉదయం 9 గంటలకు తమ్మిలేరు ప్రాజెక్ట్ కుడికాలువ లాకులు ఎత్తి ఆయకట్టుకు నీరు విడుదల చేస్తారని టీడీపీ నాయకులు తెలిపారు. ఆయకట్టు రైతులు, అన్ని గ్రామాల టీడీపీ నాయకులు, కార్యకర్తలు ఈ కార్యక్రమంలో పాల్గొనాలని కోరారు.

31న పాలిటెక్నిక్ కళాశాలలో స్పాట్ అడ్మిషన్లు

కలిదిండి, జూలై 27 : కలిదిండి పాలిటెక్నిక్ కళాశాలలో ఈ నెల 31న స్పాట్ అడ్మిషన్లు నిర్వహిస్తున్నామని ప్రిన్సిపాల్ ప్రసాద్ ప్రకటనలో తెలిపారు. ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్స్ విభాగాల కోర్సుల భర్తీకి అడ్మిషన్లు నిర్వహిస్తున్నామన్నారు. పదో తరగతి పాసైన విద్యార్థులు, పాలిసెట్ ఎంట్రన్స్ రాసిన వారు, రాయని వారు కూడా అర్హులని తెలిపారు. ఫీజు తదితర వివరాలకు కళాశాలలో సంప్రదించాలని కోరారు.

ఆగస్టు 3న రెండో విడత కౌన్సెలింగ్ మెరిట్ లిస్టు

నూజివీడు టౌన్, జూలై 27: ట్రిపుల్ ఐటీల్లో రెండో దశ జనరల్ కౌన్సెలింగ్‌కు ఎంపికైన విద్యార్థుల జాబితాను ఆగస్టు 3న విడుదల చేయనున్నట్టు అడ్మిషన్ల కన్వీనర్ ప్రొఫెసర్ అమరేంద్రకుమార్ తెలిపారు. ఆర్జీయూకేటీ పరిధిలో మొదటి విడత జనరల్ కౌన్సెలింగ్ శనివారంతో ముగిసింది. ఇందులో భాగంగా ఒక్కొక్క క్యాంపస్‌కు 1,035 మంది విద్యార్థులకు కాల్ లెటర్లు పంపగా నూజివీడు క్యాంపస్‌లో 883 మంది, ఆర్‌కే వ్యాలీలో 858 మంది, ఒంగోలులో 795, శ్రీకాకుళంలో 863 మంది ప్రవేశాలు పొందారన్నారు. మొదటి విడత జనరల్ కౌన్సెలింగ్ ప్రక్రియ పూర్తి కాగా మిగిలిన సీట్ల భర్తీకి ఆగస్టు 3న జాబితా విడుదల చేయనున్నట్లు ఆయన పేర్కొన్నారు.

క్యాంపస్ మార్పునకు అవకాశం

మొదటి దశలో అడ్మిషన్లు పొందిన విద్యార్థులు తాము కోరుకున్న క్యాంపస్ కాకుండా వేరే క్యాంపస్‌లో సీటు పొందిన సందర్భంలో యూనివర్సిటీ తొలిసారి క్యాంపస్‌ను మార్చుకునే అవకాశం కల్పిస్తోందన్నారు. అనివార్య కారణాల వల్ల కౌన్సెలింగ్‌కు హాజరు కాని వారు ఈ నెల 27 నుంచి 30 తేదీ సాయంత్రం 6 గంటల లోపు దరఖాస్తులు దాఖలు చేయవచ్చని ఆయన తెలిపారు.

ట్రిపుల్ ఐటీ విద్యార్థుల సమస్యలు పట్టించుకోవాలి

నూజివీడు టౌన్, జూలై 27: ట్రిపుల్ ఐటీల్లోని విద్యార్థుల సమస్యలను రాష్ట్ర ప్రభుత్వాలు పట్టించుకోవడం లేదని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.శివారెడ్డి అన్నారు. నూజివీడు ట్రిపుల్ ఐటీలో శనివారం ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర నాయకులు పర్యటించారు. ఈ సందర్భంగా క్యాంపస్‌లో మద్యం సరఫరా చేసిన వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేసి చర్యలు చేపట్టాలని వీసీ, డైరెక్టర్లను తక్షణం నియమించాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర కోశాధికారి సాయికుమార్, బాలికల కో-కన్వీనర్ చిన్నం ప్రీతి, సాధిక్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

దోమల నియంత్రణకు చర్యలు

నూజివీడు టౌన్, జూలై 27: నూజివీడు మున్సిపల్ పరిధిలో దోమల నియంత్రణకు మున్సిపల్ పారిశుధ్య అధికారులు చర్యలు చేపట్టారు. పట్టణంలో మలేరియా, టైఫాయిడ్ జ్వరాలు ప్రబలకుండా దోమలను అరికట్టేందుకు పట్టణంలోని మొగలి చెరువులో ఆయిల్ బాల్స్‌ను వదిలి దోమల లార్వాను నాశనం చేసేందుకు చర్యలు తీసుకున్నట్టు మున్సిపల్ శానిటరీ ఇన్‌స్పెక్టర్ నాగరాజు తెలిపారు.

సీజనల్ వ్యాధులతో అప్రమత్తంగా ఉండాలి

ముసునూరు, జూలై 27: సీజనల్ వ్యాదుల పట్ల విద్యార్థులు జాగ్రత్తగా ఉండాలని పీహెచ్‌సీ వైద్యాధికారిణి షకీనా ఇవాంజలి అన్నారు. శనివారం ముసునూరు జడ్పీపాఠశాల విద్యార్థులకు ఆరోగ్యం-పరిశుభ్రత అంశాలపై ఇన్‌చార్జ్ హెచ్‌ఎం ప్రాన్సిస్ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. వ్యక్తిగత శుభ్రతతోపాటు ఆరోగ్య సూత్రాలను విద్యార్థులు పాటించాలని, ఏమైనా ఆరోగ్య సమస్యలుంటే ఆసుపత్రిలో సంప్రదించాలని వైద్యులు కోరారు. ఎంఈవో సుబ్బారావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నూతన క్రిమినల్ చట్టాలపై మహిళలకు అవగాహన



చింతలవల్లిలో చట్టాలపై అవగాహన కల్పిస్తున్న మహిళా పోలీస్

ముసునూరు, జూలై 27: చింతలవల్లి అంగన్‌వాడీ కేంద్రంలో తల్లులకు నూతన క్రిమినల్ చట్టాలపై మహిళా పోలీస్ భూలక్ష్మి అవగాహన కల్పించారు. మహిళలు, బాలికలపై జరుగుతున్న అనేక అఘాయిత్యాలను నిరోధించేందుకు కేంద్ర ప్రభుత్వం మూడు నూతన క్రిమినల్ చట్టాలను తీసుకువచ్చిందన్నారు. వీటిలో ముఖ్యంగా మహిళలను చిత్రహింసలకు గురిచేస్తున్న వారిపై గృహ హింస రక్షణ చట్టం 2005 ద్వారా కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. అంగన్‌వాడీ కార్యకర్త పి.రాజకుమారి, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

ఆగిరిపల్లి: ఆగిరిపల్లి మసీదు ఏరియాలోని అంగన్‌వాడీ కేంద్రంలో మిషన్ శక్తి 100 రోజుల ప్రత్యేక అవగాహన కార్యక్రమంలో భాగంగా మహిళలకు గృహ హింస చట్టంపై సీడీపీవో నూరాని అవగాహన కల్పించారు. ఏసీడీపీవో నాగేశ్వరి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రాగమయి, తల్లులు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు. అలాగే ఎంవీఎం-వైవీఎస్ జూనియర్ కళాశాలలో విద్యార్థినులకు బాల్య వివాహాలు, వరకట్న నిరోధక చట్టాలపై అవగాహన కల్పించారు.

చాట్రాయి: చాట్రాయి జడ్పీ హైస్కూల్‌లో శనివారం మిషన్ శక్తి పథకంపై సమావేశం నిర్వహించారు. చట్టాలు, సీజనల్ వ్యాధుల నివారణ, పరిసరాల పరిశుభ్రత, పిల్లలకు వ్యాధులు రాకుండా ప్రభుత్వం అమలు చేస్తున్న వ్యాక్సినేషన్, ప్రభుత్వ వైద్యసేవలపై వివరించారు. ఐసీడీయస్ సీడీపీవో నూరాని, ఎంఈవో బ్రహ్మాచారి, హెచ్‌ఎం కృష్ణయ్య, ఉపాధ్యాయులు, అంగన్వాడీ సూపర్‌వైజర్లు గాయత్రి, రమాదేవి అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

నూజివీడు టౌన్: అనేక రూపాల్లో మహిళలపై గృహ హింస జరుగుతోందని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రాజ్యలక్ష్మి అన్నారు. అంగన్వాడీ కేంద్రాల పరిధిలో మహిళల సంరక్షణకు కార్యకర్తలు కృషి చేయాలన్నారు. దిగవల్లి సెక్టార్ పరిధిలో అన్నవరం అంగన్వాడీ సెంటర్లో శనివారం నిర్వహించిన కార్యక్రమానికి అంగన్వాడీలు, ఏఎన్‌ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

మండవల్లి: కానుకొల్లు జడ్పీ హైస్కూల్లో శనివారం బేటీ బచావో-బేటీ పడావో కార్యక్రమం నిర్వహించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ నాగలక్ష్మి మాట్లాడుతూ బాల్యవివాహాల నియంత్రణ, తల్లీబిడ్డల సంరక్షణ అంశాలపై ప్రతి అంగన్వాడీ కేంద్ర పరిధిలో ప్రజలకు అవగాహన కల్పించామన్నారు. మండవల్లి హెల్త్ సూపర్‌వైజర్ మోతీబాయి, ఏఎన్‌ఎం కమల, ఎంఎస్‌కే తేజావతి, ఉపాధ్యాయులు, అంగన్వాడీ సిబ్బంది, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

బుర్రకథ కళాకారుడు పీవీ రావు మృతి



చాట్రాయి, జూలై 27: ప్రఖ్యాత బుర్రకథ కళాకారుడు పొగడపూల వెంకటేశ్వరరావు (పీవీరావు) (94) అనారోగ్యంతో శనివారం చనుబండలోని తన స్వగృహంలో కన్నుమూశారు. బుర్రకథ సమ్రాట్ నాజర్ బృందంలో వంతలుగా పీవీ రావుతో పాటు ఇదే గ్రామానికి చెందిన వైవీరావు సుదీర్ఘ కాలం దేశవ్యాప్తంగా ప్రదర్శనలు ఇచ్చారు. ఆకాశవాణి విజయవాడ కేంద్రం, హైదరాబాద్ దూరదర్శన్ కేంద్రం, నాగార్జునసాగర్ ప్రాజెక్టు ప్రారంభోత్సవాలలో నాజర్‌తో కలిసి పీవీరావు ప్రదర్శనలు ఇచ్చారు. మాజీ రాష్ట్రపతులు రాజేంద్రప్రసాద్, నీలం సంజీవరెడ్డి, మాజీ ప్రధాని ఇందిరాగాంధీ ఎదుట నాజర్‌తో కలసి ప్రదర్శనలు ఇచ్చి అవార్డులు, ప్రశంసలు పొందారు. ఈయనకు ముగ్గురు కుమారులున్నారు. గ్రామ ప్రముఖులు పీవీరావు భౌతికకాయాన్ని సందర్శించి నివాళులర్పించారు.

యువత మత్తుకు దూరంగా ఉండాలి

ముదినేపల్లి, జూలై 27 : మాదక ద్రవ్యాలకు యువత దూరంగా ఉండాలని శనివారం ముదినేపల్లి మండలం గురజ జడ్పీ హైస్కూల్ విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. అమరావతి బ్రాండ్ అంబాసిడర్ అంబుల వైష్ణవి, హెచ్‌ఎం జి.కృష్ణమోహన్, ఉపాధ్యాయులు, వైద్యుడు డాక్టర్ మనోజ్ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించి యువతా మేలుకో - భవిష్యత్తును కాపాడుకో అంటూ నినాదాలు చేశారు. ప్రతిజ్ఞ చేశారు. పలువురు గ్రామస్థులు ర్యాలీలో పాల్గొన్నారు.

జనసేన క్రియాశీల సభ్యత్వ నమోదు

ముసునూరు, జూలై 27: మండలంలోని పలు గ్రామాల్లో జనసేన క్రియాశీలక సభ్యత్వ నమోదును పాశం నాగబాబు ఆధ్వర్యంలో శనివారం నిర్వహించారు. రమణక్కపేట, చెక్కపల్లి, సూరేపల్లి తదితర గ్రామాల్లో నమోదు జరిగింది. ఈ సందర్భంగా నాగబాబు మాట్లాడుతూ పార్టీ బీమాతో కూడిన సభ్యత్వాన్ని ఇస్తున్నామన్నారు. ఇటీవల రెండు కుటుంబాలకు పార్టీ ప్రధాన కార్యదర్శి కొణిదల నాగబాబు చేతులమీదుగా రూ. 10 లక్షల విలువగల చెక్కులను ఇవ్వడం జరిగిందన్నారు. జనసేన పార్టీ అభిమాని, కార్యకర్త సభ్యత్వం తీసుకోవాలని కోరారు.



వీల్ చైర్లు అందజేస్తున్న దృశ్యం

మెగా రక్త శిబిరానికి విశేష స్పందన

ముదినేపల్లి, జూలై 27: ఎన్టీఆర్ ట్రస్టు, కొడాలి వినోద్ ఫాలోవర్స్ సంయుక్తంగా ముదినేపల్లి ఎన్‌డీఏ కార్యాలయం వద్ద శనివారం నిర్వహించిన మెగా రక్తదాన శిబిరానికి విశేష స్పందన లభించింది. టీడీపీ కైకలూరు నియోజకవర్గ పోల్ మేనేజ్‌మెంట్ ఇన్‌చార్జ్ కొడాలి వినోద్ పుట్టిన రోజు సందర్భంగా నిర్వహించిన ఈ శిబిరంలో వినోద్‌తో పాటు సుమారు 360 మంది యువకులు, టీడీపీ కార్యకర్తలు రక్తదానం చేశారు. ఈ సందర్భంగా వినోద్ నలుగురు దివ్యాంగులకు వీల్ చైర్లు అందజేశారు. టీడీపీ నియోజకవర్గ సమన్వయ కమిటీ కన్వీనర్ వీరమల్లు నరసింహారావు, రాష్ట్ర కార్యదర్శి కొత్తా నాగేంద్ర కుమార్, బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి కోటప్రోలు కృష్ణారావు, జనసేన మండల కన్వీనర్ వీరంకి వెంకటేశ్వరరావు వినోద్‌ను అభినందించారు. మంత్రి లోకేశ్, ఎమ్మెల్యేలు కామినేని శ్రీనివాస్, వెనిగండ్ల రాము, కాగిత కృష్ణప్రసాద్, మాజీ ఎమ్మెల్యే వంగవీటి రాధా వినోద్‌కు ఫోన్‌లో పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలిపారు.

కలుషిత నీరు.. అధ్వాన పారిశుధ్యం

గొల్లగూడెం వాసుల ఆగ్రహం



గొల్లగూడెంలో కుళాయిలో వస్తున్న కలుషిత నీరు

ముసునూరు, జూలై 27: సూరేపల్లి పంచాయతీ పరిధిలోని గొల్లగూడెం కాలనీలో పారిశుధ్యం అధ్వానంగా ఉంది. పైప్‌లైన్ లీకేజీల వల్ల కలుషిత నీరు వస్తోందని, డ్రెయినేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉండటంతో రహదారులపైనే మురుగు, వర్షపునీరు నిల్వ ఉండి దోమల ఉధృతి పెరిగి విషజ్వరాల బారిన పడుతున్నామని కాలనీవాసులు వాపోతున్నారు. దీనిపై టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ముద్దరబోయిన వెంకటేశ్వరరావు దృష్టికి తీసుకువెళ్లగా ఆయన ఎంపీడీవో పద్మావతిదేవికి ఫోన్ చేసి సమస్యలు పరిష్కరించాలని సూచించారని అయితే సచివాలయ కార్యదర్శి సూర్యనారాయణ ఆధ్వర్యంలో అక్కడక్కడ కంటితుడుపుగా బ్లీచింగ్ చల్లి మిగతా సమస్యలు వదిలేశారని, పారి శుద్ధ్యం మెరుగుకు ఉన్నతా ధికారులు చర్యలు చేప ట్టాలని కాలనీవాసులు కోరుతున్నారు.